
ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY

5



తిరుపతి

జిల్లా వార్తలు

బుధవారం 24 సెప్టెంబరు 2025

తిరుమలేశుడికి బ్రహ్మాండోత్సవం


నేటి నుంచి ప్రారంభంకానున్న వాహన సేవలు

పుష్ప, విద్యుత్ అలంకరణలతో ముస్తాబైన కొండ





శ్రీవారి ఆలయం ముందు..



శ్రీవారి ఆలయం లోపల అలంకరణ

తిరుమల, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): తొమ్మిది రోజులపాటు తిరుమలేశుడికి జరిగే బ్రహ్మాండోత్సవానికి టీటీడీ అంతా సిద్ధం చేసింది. భక్తుల రద్దీని దృష్టిలో పెట్టుకుని టీటీడీ దాదాపు రూ.25 కోట్లతో ఏర్పాట్లను చేపట్టింది. పుష్ప, విద్యుద్దీపాలంకరణలతో తిరుమల కొండ భక్తులకు కనువిందు చేస్తోంది. మంగళవారం అంకురార్పణ ఘట్టంతోనే తిరుమలకు బ్రహ్మోత్సవ శోభ సంతరించుకుంది. బుధవారం సాయంత్రం 5.43 నుంచి 6.15 గంటల వరకు మీనలగ్నంలో ధ్వజారోహణం నిర్వహించనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున సీఎం చంద్రబాబు నాయుడు శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారు. ఇక, రాత్రి 9 నుంచి 11 గంటల వరకు పెద్దశేషవాహన సేవ జరగనుంది. దీంతో ఆలయ నాలుగు మాడవీధుల్లో వాహనసేవలు మొదలు కానున్నాయి. ప్రతి రోజు ఉదయం 8 నుంచి 10 వరకు, రాత్రి 7 నుంచి 9 గంటల వరకు దేవేరులతో కలిసి మలయప్పస్వామి వివిధ వాహనాలపై మాడ వీధుల్లో విహరిస్తూ భక్తులను కటాక్షించనున్నారు. 28వ తేదీన గరుడవాహనం మాత్రం సాయంత్రం 6.30 గంటలకే మొదలుకానుంది.

మెరిసిపోతున్న కొండ

ఈఏడాది రూ.5.30 కోట్లతో అలిపిరి గరుడ సర్కిల్ నుంచి శ్రీవారి ఆలయం వరకు విద్యుద్దీపాలంకరణ చేపట్టారు. శ్రీవారి ఆలయంతో పాటు జీఎన్సీ టోల్‌గేట్ నుంచి ఆర్టీసీ బస్టాండ్, వైకుంఠం క్యూకాంప్లెక్స్ మాడవీధులు, అన్నప్రసాదభవనం, ఆస్థానమండపం, రాంభగీచ, లడ్డూకౌంటర్ వంటి ప్రధాన ప్రాంతాలతో పాటు రోడ్లుకు ఇరువైపులా, పార్కులు, వాటర్ ఫౌంటెన్లు, ప్రధాన కూడళ్లలో ఎల్ఈడీ, పార్కాన్ లైట్లతో ప్రత్యేకంగా అలంకరణలు చేశారు.

మనసుదోచే పుష్పాలంకరణ

ఏటా 8 నుంచి 10 టన్నుల పుష్పాలతో అలంకరణ చేపట్టేవారు. ఈసారి ఎక్కువమంది దాతలు ముందుకు రావడంతో 6 టన్నులతో శ్రీవారి ఆలయంలోపల, మరో 12 టన్నులతో వెలుపల.. మొత్తం 18 టన్నుల సంప్రదాయ పుష్పాలతో స్వామి క్షేత్రాన్ని ముస్తాబు చేశారు. లక్ష కట్‌ఫ్లవర్స్‌లో ఆలయంలోని ధ్వజస్తంభం ప్రాంతాన్ని తీర్చిదిద్దారు. గరుడసేవ ముందు రోజు, మహారథం ముందురోజు ఈ పుష్పాలంకరణలను మార్చనున్నారు. ఈఏడాది ప్రత్యేకంగా వైకుంఠం క్యూకాంప్లెక్స్1, జీఎన్సీ టోల్ గేట్ వద్ద పుష్పాలంకరణలు చేశారు.

కంకణ భట్టాచార్యుడిగా వేణుగోపాల దీక్షితులు

ఏటా బ్రహ్మోత్సవాల్లో అర్చకుల్లో ఒక్కరిని కంకణ భట్టాచార్యులుగా నియమిస్తారు. ఈ క్రమంలోనే పూర్వం బ్రహ్మోత్సవాలతో పాటు వసంతోత్సవాలు వంటి కైంకర్యాలను విజయవంతంగా నిర్వహించి, శ్రీవారి ఆలయంలో ప్రధాన అర్చకుడిగా వ్యవహరిస్తున్న వేణుగోపాల దీక్షితులను ఈఏడాది ఎంపిక చేశారు. అంకురార్పణ నుంచి చక్రస్నానం వరకు ఆయన ప్రధాన పాత్రపోషిస్తారు. ఉదయం, సాయంత్రం మడిని పాటిస్తూ నిత్యహోమాలు, ఇతర వైదిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఉత్సవాలు పూర్తయ్యే వరకు పొలిమేర దాటరు.

మరిన్ని బ్రహ్మోత్సవ కథనాలు.. 8లో

ఏర్పాట్లు భేష్..!

- ఊరేగింపుగా వెళ్లి పరిశీలించిన విష్వక్సేనుడు
- శ్రీవారి ఆలయంలో శాస్త్రోక్తంగా అంకురార్పణ

తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాలకు మంగళవారం రాత్రి శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ఇందులో భాగంగా శ్రీవారి సేనాధిపతి అయిన విష్వక్సేనుడు రాత్రి 7 గంటలకు విశేష అలంకరణలో గదతో తిరుచ్చి వాహనంపై ఆలయం నుంచి వెలుపలకు వచ్చారు. మహాద్వారం వద్ద హారతి అందుకుని నాలుగు మాడవీధుల్లో ఊరేగుతూ బ్రహ్మోత్సవ ఏర్పాట్లను పరిశీలించారు. ఇక, ఆలయంలోని యాగశాలకు సమీపంలో అంకురార్పణ జరిగే ప్రదేశాన్ని ముందుగానే పేడతో అలంకరించారు. సేనాధిపతి ఊరేగింపు తర్వాత ఆ ప్రదేశంలో బ్రహ్మపీఠాన్ని ఏర్పాటు చేశారు. అనంతరం మంట ద్వారా బ్రహ్మ, గరుడ, శేష, సుదర్శన, వక్రతుండ, సోమ, శంత, ఇంద్ర, ఇసాన, జయ అనే దేవతలను ఆహ్వానించారు. అనంతరం భూమాతను ప్రార్థిస్తూ అందులో ముందుగానే సేకరించిన మట్టిని కుండలలో వేసి శాలి, వ్రిహి, యువ, ముద్గ, మాష, ప్రియంగు వంటి నవధాన్యాలను చల్లి నీరు పోశారు. ఆ పాలికలను నూతన వస్త్రంతో అలంకరించి పుణ్యాహవచనం నిర్వహించారు. ఇలా శాస్త్రోక్తంగా అంకురార్పణ నిర్వహించారు. ప్రతిరోజూ ఈ పాలికల్లో కొద్దిగా నీరు పోస్తూ మొలకలు వచ్చేలా చర్యలు తీసుకుంటారు. ఉత్సవాలు విజయవంతం కావాలని సంకల్పించడంతో పాటు స్వామి ఆశీస్సులు పొందడమే ఈ ఘట్ట ఉద్దేశం. ఆయా కార్యక్రమాల్లో టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో అనిల్‌కుమార్ సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి, దివాకర్‌రెడ్డి, నరేష్, శాంతారామ్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

స్వామిసేవకు 50 మంది అర్చకులు

వాహనసేవలను, యాగశాల్లో కైంకర్యాలను ఆగమోక్తంగా నిర్వహించేందుకు 50 మందికిపైగా అర్చకులు సిద్ధమయ్యారు. ఉదయం, రాత్రి జరిగే వాహనసేవలతో పాటు యాగశాల, గర్భాలయం, ఉప ఆలయాలు వంటి వివిధ ప్రాంతాల్లో కైంకర్యాల కోసం అర్చకులకు విధులు కేటాయిస్తూ ప్రణాళికలు రూపొందించుకున్నారు. ఇక, వాహనసేవల్లోని ఉత్సవర్లను అలంకరించేందుకు ఎప్పటిలానే చెన్నై నుంచి మరో ఇద్దరు అలంకరణ భట్టాచార్యులు తిరుమలకు చేరుకున్నారు.

టీటీడీ బోర్డులో తిరుపతి ఎమ్మెల్యేకి చోటెప్పుడు?

- కోర్టు తీర్పు, ప్రభుత్వ ఉత్తర్వులున్నా ఆలస్యమెందుకో?

(తిరుపతి- ఆంధ్రజ్యోతి)

- తిరుమల బాలాజీనగర్‌లో కాలనీ బాగా దెబ్బతిన్న ఇళ్లను బాగు చేయాలని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అక్కడి స్థానికుల విజ్ఞప్తి మేరకు పలుసార్లు టీటీడీ ఉన్నతాధికారులను కోరారు. కానీ ఇప్పటివరకు ఒక ఇటుక కూడా కదలలేదు.
- తిరుపతిలో టీటీడీ చేయాల్సిన కొన్ని మౌలిక సదుపాయాల కల్పనకు ఎమ్మెల్యే గొంతు వినిపించే అవకాశం దొరకలేదు.

తిరుపతి నగర అభివృద్ధి టీటీడీతో ముడిపడి ఉంటుంది. టీటీడీ ఉద్యోగులంతా నివసించేది తిరుమలలోనే. ఈ రెండింటికీ వారధిగా ఉండాల్సిన ప్రజాప్రతినిధులకు టీటీడీ పాలకమండలిలో అవకాశం ఉంటే ఎక్కువ ప్రయోజనం ఉంటుంది. వైసీపీ ప్రభుత్వంలో ఆ అవకాశం తిరుపతి ఎమ్మెల్యేకి దక్కినా, కూటమి ప్రభుత్వంలో మాత్రం లభించలేదు. తిరుపతి నియోజకవర్గ ప్రజాప్రతినిధిగా టీటీడీ పాలక మండలిలో మాట్లాడే అవకాశం ఉంటే సమస్యలు సత్వరమే పరిష్కార దిశగా అడుగులు పడే వీలుంటుంది. తిరుపతి ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాలకు ప్రాధాన్యమిచ్చి బడ్జెట్ కేటాయింపులు, పనుల్లో వేగం పెంచేలా చేయవచ్చు. స్థానిక సమస్యలను, అభ్యర్థులను బోర్డు సమావేశాల్లో వినిపించవచ్చు. పాలకమండలిలో ఎమ్మెల్యే ఉండడం వలన ప్రజల సమస్యలు, అభ్యర్థనలు త్వరగా పరిష్కారమయ్యేందుకు వీలుంటుంది. రాష్ట్ర ప్రభుత్వానికి టీటీడీకి మధ్య వారధిగా ఎమ్మెల్యే పనిచేసే సౌలభ్యం ఉంటుంది. అంతేకాకుండా తిరుపతి నగరానికి ప్రత్యేక గుర్తింపు, ప్రాధాన్యత, అభివృద్ధి అవకాశాలు పెరిగే అవకాశం ఉంటుంది.

తుడాకిచ్చి ఎమ్మెల్యేని పక్కనపెట్టి

దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్ రెడ్డి ప్రభుత్వం నుంచి తుడా చైర్మన్‌ను టీటీడీ ఎక్స్‌అఫిషియోగా చేర్చారు. 2014లో టీడీపీ అధికారంలోకి వచ్చాక ఆ విధానాన్ని రద్దుచేశారు. 2019లో అధికారంలోకి వచ్చిన జగన్‌రెడ్డి ప్రభుత్వం తిరుపతి ఎమ్మెల్యే, తుడా చైర్మన్లకిద్దరికీ టీటీడీ పాలక మండలిలో అవకాశం కల్పించింది. ఈక్రమంలో ప్రత్యేక ఆహ్వానితులుగా జగన్‌రెడ్డి 52 మందితో జంబో కమిటీవేస్తే కోర్టు మొట్టికాయలు వేస్తూ రద్దు చేసింది. అయితే తిరుపతి ఎమ్మెల్యేగా టీటీడీ పాలక మండలిలో ఉండొచ్చని కోర్టు చెప్పింది. దీంతో అప్పటి ఎమ్మెల్యే కరుణాకరరెడ్డి ప్రత్యేక ఆహ్వానితుడిగా కొనసాగారు. ఆతర్వాత కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కేవలం తుడా చైర్మన్‌కు మాత్రమే టీటీడీ ఎక్స్‌అఫిషియోగా కొనసాగిస్తూ జీవో ఇచ్చారు. ఎమ్మెల్యేను మాత్రం సందిగ్ధంలో పెట్టేశారు.

టీటీడీ బోర్డులో చోటెందుకంటే..?

టీటీడీలో రెగ్యులర్, అవుట్‌సోర్సింగ్ ఉద్యగులు దాదాపు 20వేలకుపైనే ఉన్నారు. అదేవిధంగా తిరుమలలోని బాలాజీనగర్‌లో దాదాపు 1100 కుటుంబాలు నివసిస్తున్నారు. వీరంతా తిరుపతి నియోజకవర్గ ఓటర్లే. ఎమ్మెల్యేగా వారి సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ఆయనపై ఉంది. దేశ నలుమూలల నుంచి శ్రీవారి దర్శనం కోసం వచ్చే యాత్రికులకోసం తిరుపతి, తిరుమలలో మౌలిక సదుపాయాలు మెరుగుపరచడానికి కృషిచేయాల్సివుంది. టీటీడీతో పాటు తిరుమల స్థానిక ప్రజల నుంచీ నిరంతరం ఫిర్యాదులు వస్తుంటాయి. వాటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలంటే ఎమ్మెల్యేగా అంత వీలుండకపోవచ్చు. అదే పాలకమండలిలో చోటుంటే సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేయవచ్చు.

పవన్ ద్వారా ఎమ్మెల్యే వినతి

టీటీడీ పాలకమండలిలో ప్రత్యేక ఆహ్వానితుడిగా ఉన్న జీవోను కొనసాగించాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు ఇదివరకే సీఎం చంద్రబాబుకు వినతిపత్రం అందించారు. అంతేకాకుండా జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ దృష్టికి తీసుకెళ్లి ఆయన సంతకం చేసిన వినతి కూడా సీఎంవోకు వెళ్లింది. అయినా పాలకమండలి నియామకం జరిగి ఏడాది దగ్గరపడుతున్నా ప్రభుత్వం మౌనంగా ఉండడంపై జనసైనికులు నైరాశ్యంలో ఉన్నారు. తిరుపతిలో పార్టీ అస్తిత్వానికి సంబంధించిన అంశంగా భావిస్తున్నారు.


నేడు ఉపరాష్ట్రపతి రాక

తిరుపతి(కలెక్టరేట్)/తిరుమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ బుధవారం సాయంత్రం 7.30 గంటలకు ప్రత్యేక విమానంలో రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. రోడ్డు మార్గాన తిరుమల చేరుకుని శ్రీవారిని దర్శించుకుంటారు. గురువారం ఉదయం మరోసారి శ్రీవారిని దర్శించుకున్నాక పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. 11.30 గంటలకు తిరుచానూరు పద్మావతి అమ్మవారిని దర్శించుకుని ఢిల్లీకి తిరుగు ప్రయాణమవుతారు.

వీఐపీలకు విస్తృత బందోబస్తు



తిరుపతి (నేరవిభాగం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఉపరాష్ట్రపతి, సీఎం పర్యటన నేపథ్యంలో జిల్లా పోలీసు యంత్రాంగం పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసింది. తిరుపతిలో అదనపు ఎస్పీ, ఇద్దరు డీఎస్పీలు, 25 మంది సీఐలు, 50 మంది ఎస్ఐలు, మరో 150 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, హోంగార్డులు, బాంబు డిస్పోజల్, డాగ్ స్క్వాడ్‌లు బందోబస్తులో పాల్గొంటారు. రేణిగుంట విమానాశ్రయం నుంచి తిరుమల మార్గంలో గట్టి నిఘా ఏర్పాటు చేశారు. వీఐపీల భద్రతకు ఇద్దరు అదనపు ఎస్పీలు, రిజర్వు బలగాలు, ఐదుగురు డీఎస్పీలు, 10 మంది సీఐలు, 20 మంది ఎస్ఐలు, మరో 300 మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, కానిస్టేబుళ్లు, పోలీసులను వినియోగిస్తున్నారు.ఏపీఎస్పీ, రిజర్వు, ఆక్టోపస్, విజిలెన్సు, సిబ్బంది బందోబస్తు విధుల్లో నిమగ్నమయ్యారు. వీఐపీలు వెళ్ళే సమయంలో 45 నిమిషాల ముందు ఘాట్‌లో వాహనాల రాకపోకలను ఆపనున్నారు. సీసీ కెమెరాలు, డ్రోన్లతో నిరంతరం పర్యవేక్షిస్తున్నారు.



రేపు సీఎం ప్రారంభించనున్న ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్

శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్న సీఎం

తిరుమల/తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు ప్రభుత్వం తరపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. దీనికోసం ఆయన బుధవారం సాయంత్రం హెలికాప్టర్‌లో తిరుపతిలోని తాజ్ హోటల్ వద్ద హెలిప్యాడ్‌కు చేరుకుంటారు. రోడ్డు మార్గాన తిరుమలలోని గాయత్రి నిలయానికి వస్తారు. రాత్రి 7.40గంటలకు బేడీ ఆంజనేయస్వామి ఆలయ ప్రాంగణానికి చేరుకుంటారు. ఆయనకు అర్చకులు పరివట్టం చుట్టగా తలపై వెండిపళ్లెంలో పట్టువస్త్రాలను ఈవో ఉంచుతారు. మంగళవాయిద్యాల నడుమ ఆలయానికి చేరుకుని వస్త్రాలను బహూకరించి మూలవర్లను దర్శించుకుంటారు. రంగనాయకుల మండపంలో టీటీడీ 2026 డైరీ, క్యాలెండర్లు ఆవిష్కరిస్తారు. వాహన మండపం వద్ద పెద్దశేషవాహన సేవలో పాల్గొంటారు. గురువారం ఉదయం 9.10 గంటలకు భక్తుల వసతిగృహం వెంకటాద్రి నిలయాన్ని ప్రారంభిస్తారు. ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను(ఐసీసీసీ)- ఇంటెలిజెంట్ క్రౌడ్ అండ్ సైబర్ కంట్రోల్, ప్రసాదాలకు సంబంధించిన ప్లాంట్‌ను ప్రారంభించి తిరుగు ప్రయాణమవుతారు. అలాగే, మంత్రి నారా లోకేశ్ కూడా పశ్చిమ గోదావరి జిల్లా పాలకొల్లు నుంచి హెలికాప్టర్‌లో బుధవారం సాయంత్రం 5 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుంటారు. అక్కడ్నుంచి రోడ్డు మార్గాన తిరుమలలోని గాయత్రి గెస్ట్ హౌస్‌కు చేరుకుంటారు. రాత్రి 7.30 నుంచీ 9 గంటల నడుమ శ్రీవారిని దర్శించుకుంటారు. గురువారం ఉదయం 10.15 గంటలకు తిరుగు ప్రయాణమవుతారు.

శరన్నవరాత్రి అలంకరణలు









మంగళవారం బాలాత్రిపుర సుందరి అలంకారంలో తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ, శ్రీకాళహస్తిలోని కనకాచలంపై కొలువైన కనకదుర్గమ్మ, గాయత్రీదేవి అలంకరణలో సూళ్లూరుపేట చెంగాళమ్మ, చిల్లకూరు మండలం తూర్పు కనుపూరులోని ముత్యాలమ్మ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు.

చంద్రగిరి

విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఎదగాలి



ఫ్రెషర్స్ డే వేడుకల్లో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ రమేష్ కుమార్

పాకాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో ఎదగాలని ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్వీ రమేష్ కుమార్ ఆకాంక్షించారు. స్థానిక ప్రభుత్వ డి గ్రీ కళాశాలలో మంగళవారం ఫ్రెషర్స్‌డే వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ క్రమశిక్షణతో ఇష్టంగా కష్టపడి చదివి తల్లిదండ్రులు, తమ గురువులు గర్వించేలా ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. మానవీయ విలువలతో విద్యనభ్యసించి సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలు చేయాలన్నారు.విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రధానాచార్యులు రెడ్డిరామరాజు, ఉమామహేశ్వరి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాశిలామణి, అధ్యాపకులు, తదితరులు పాల్గొన్నారు.

తిరుచ్చిపై సూర్యభగవానుడి అభయం



తిరుచానూరు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తిరుచానూరులో కొలువై ఉన్న సూర్యనారాయణస్వామికి మంగళవారం తిరువీధి ఉత్సవం జరిగింది. స్వామివారి జన్మనక్షత్రం హస్త పురస్కరించుకుని అర్చకులు విశేష పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. మూలమూర్తికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో అభిషేకం నిర్వహించారు. సాయంత్రం సర్వఅలంకార శోభితులైన సూర్యనారాయణస్వామి బంగారు తిరుచ్చిపై కొలువుదీరి మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, సూపరింటెండెంట్ రమేష్, ఏవీఎస్వో రాధాకృష్ణమూర్తి, టెంపుల్ ఇన్‌స్పెక్టర్లు ప్రసాద్, చలపతి సుబ్బరాయుడు, సుభాస్కర్‌నాయుడు, అఖండం హరి పాల్గొన్నారు.

ఉద్యోగుల డీఏ బకాయిలు చెల్లించాలి: ఎస్టీయూ

ఎర్రావారిపాలెం,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):ఉపాధ్యాయ,ఉద్యోగులు, పెన్షనర్లకు చెల్లించాల్సిన నాలుగు కరువు భత్యాలను రాష్ట్ర ప్రభుత్వం విస్మరించిందని ఎస్టీయూ జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ మల్లీశ్వర్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం నాడిక్కడ సంఘం నేతలతో కలిసి ఆయన విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం వచ్చి ఏడాదన్నర కావస్తున్నా డీఏల ఊసెత్తకపోవడం బాధాకరమన్నారు. ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా డీఏ బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో చంద్రగిరి డివిజనల్ కన్వీనర్ వెంకటరమణ,మండల అధ్యక్షుడు వెంకటాద్రి,నాయకులు అప్పన్న, నవీన్, వెంకరెడ్డి పాల్గొన్నారు.

కల్యాణ వెంకన్న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ

తిరుపతిరూరల్, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): తుమ్మలగుంటలోని కల్యాణ వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు మంగళవారం సాయంత్రం అంకురార్పణ జరిగింది. సాయంత్రం పుణ్యాహవచనం, మత్స్యంగ్రహణం, సేనాధిపతి ఉత్సవానంతరం అంకురార్పణ చేశారు. విశ్వక్సేనులవారు స్వామివారికి జరిగే బ్రహ్మోత్సవాల ఏర్పాట్లను తిరుచ్చిపై విహరిస్తూ పర్యవేక్షించారు. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సతీమణి లక్ష్మి, సోదరుడు రఘునాథరెడ్డి, తుడా మాజీచైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, హర్షిత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

డిప్యుటేషన్ సిబ్బందికి అవగాహన

తిరుమల, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల సమయంలో డిప్యూటేషన్ అధికారులు, సిబ్బంది భక్తి, నిబద్ధతతో విధులు నిర్వర్తించాలని టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి కోరారు. ఆస్థాన మండపంలో మంగళవారం ఆయన డిప్యూటేషన్ సిబ్బందికి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ.. సంబంధిత ప్రాంతాల్లో ఇప్పటికే విధులు నిర్వర్తిస్తున్న సిబ్బందితో సమన్వయం చేసుకుని, బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించాలన్నారు. నిర్దిష్ట విధివిధానాలతో పాటు చెక్‌లిస్ట్‌లను కూడా సిద్ధం చేశామన్నారు. భక్తుల నుంచి సరైన ఫీడ్‌బ్యాక్ పొందేందుకు వీలుకలుగుతుందన్నారు. జేఈవో వీరబ్రహ్మం, సీవీఎస్వో మురళీకృష్ణ, ఇతర అధికారులు, డిప్యూటేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

ఓపెన్ స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఓపెన్ స్కూల్ 10వ తరగతి, ఇంటర్ ప్రవేశ దరఖాస్తుకు వచ్చేనెల 31వ తేదీ వరకు గడువు పొడిగించినట్టు డీఈఓ కేవీఎన్ కుమార్ తెలిపారు. నిరుద్యోగులు, అధ్యయన కేంద్రాల సమన్వయ కర్తల వినతి మేరకు రూ. 200 అపరాధ రుసుముతో గడువును పొడిగిస్తూ రాష్ట్ర ఓపెన్ స్కూల్ సంచాలకులు నిర్ణయం తీసుకున్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు





జస్టిస్ దుప్పల వెంకటరమణ, గోపిచంద్, చాముండేశ్వరీనాథ్

తిరుమల, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. మధ్యప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, మాజీ క్రికెటర్ చాముండేశ్వరీనాథ్, బ్యాడ్మింటన్ కోచ్ పుల్లెల గోపిచంద్ ఉన్నారు.

బ్రహ్మోత్సవాల్లో భక్తుల భద్రత ముఖ్యం

పోలీసు అధికారులతో ఎస్పీ సుబ్బరాయుడు



తిరుమల, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భక్తుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ఆదేశించారు. డీఐజీ షిముషితో కలిసి మంగళవారం తిరుమలలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ వద్ద బ్రహ్మోత్సవాల విధుల కోసం వచ్చిన అధికారులు, సిబ్బందితో మాట్లాడారు. బ్రహ్మోత్సవాల్లో 3,785 మందితో బందోబస్తును ఏర్పాటు చేశామన్నారు. గరుడసేవరోజు అదనంగా 1,169 మంది విధులు నిర్వహిస్తారన్నారు. అత్యవసర పరిస్థితుల్లో వెంటనే ఉన్నతాధికారులకు సమాచారమివ్వాలని సూచించారు. ఘాట్‌రోడ్లలో అత్యవసర వాహనాలకు ఆటంకం లేకుండా చూడాలన్నారు. ప్రతి వాహనం కదిలికలపై దృష్టి ఉండాలన్నారు. ట్రాఫిక్ సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపరాష్ట్రపతి, సీఎం పర్యటనల నేపథ్యంలో భద్రత నిబంధనలను కట్టుదిట్టంగా అమలుచేయాలన్నారు. ప్రత్యేక పార్టీలు, బాంబ్-డాగ్ స్క్వాడ్ బృందాలు నిరంతరాయంగా తనిఖీలు చేపట్టాలన్నారు. ఆక్టోపస్ సిబ్బంది కూడా ప్రత్యేక నిఘాతో ఉండాలన్నారు. అంతకుముందు సీఎం పర్యటించే ప్రదేశాల్లో తిరిగి భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.

బాలల హక్కుల పరిరక్షణకు కలిసికట్టుగా పనిచేయాలి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): బాలల హక్కులకు ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పనిచేయాలని డీఆర్వో నరసింహులు అన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం మిషన్ వాత్సల్యపై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మిషన్ వాత్సల్య పథకం అమలుకు అధికారులు సమన్వయంతోపనిచేసి లక్ష్యాలను చేరుకోవాలన్నారు. సమాజంలో నిరాధరణకు గురైన బాలలకు రక్షణ కల్పించి వారికి మిషన్ వాత్సల్య పథకం ద్వారా విద్య, ఆరోగ్యం తదితర సౌకర్యాలను కల్పించి సమాజంలో వారిని అభివృద్ధి పథంలో తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ, సాధికారత అధికారిణి వసంతబాయి, మిషన్ కోఆర్డినేటర్ కృష్ణమంజరి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

డాక్టరేట్ ప్రదానం



సరస్వతిబాయి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీ సీఎస్ఈ పరిశోధకులు వి. సరస్వతిబాయి డాక్టరేట్ పొందారు. ఏఐ- ఆధారిత క్లౌడ్ ఫోరెన్సిక్ సెక్యూరిటీ మోడల్ యూజింగ్ డీప్ లెర్నింగ్ ఫర్ ఇంట్రూషన్ ఐడెంటిఫికేషన్ అండ్ ఎవిడెన్షియరీ ప్రిజర్వేషన్ అంశంపై ప్రొఫెసర్ సుధ పర్యవేక్షణలో పరిశోధన పూర్తి చేసినట్టు పీఆర్వో శ్రీరజని తెలిపారు.

గంగమ్మ సేవలో పనబాక లక్ష్మి



తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ సేవలో మంగళవారం సాయంత్రం టీటీడీ పాలక మండలి సభ్యురాలు పనబాక లక్ష్మి పాల్గొన్నారు. ఆమెకు ఆలయ పాలక మండలి సభ్యులు, అధికారులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ సీనియర్ నాయకులు మబ్బు దేవనారాయణ రెడ్డి, డిప్యూటీ మేయర్ ఆర్సీమునికృష్ణ, ఆలయ చైర్మన్ మహేష్ యాదవ్, ఈవో జయకుమార్, పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్ల ప్రదానం

తిరుచానూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు రోడ్డులోని మహిళా ప్రాంగణంలో వివిధకోర్సుల్లో శిక్షణ పొందిన మహిళలకు మంగళవారం ఎమ్మెల్యే పులివర్తి నాని సతీమణి సుధారెడ్డి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. మహిళా ప్రాంగణంలో జనరల్ డ్యూటీ అసిస్టెంట్ ట్రైనీ(నర్సింగ్), ఫ్యాబ్రిక్ కట్టర్(టైలరింగ్)లో పలువురు మహిళలు శిక్షణ పూర్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మేనేజరు పర్వీన, సుచరితారెడ్డి, మహిళా ప్రాంగణం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గాయత్రీదేవిగా మూలస్థానమ్మ దర్శనం











గాయత్రి అలంకరణలో మూలస్థానమ్మ, కన్యకా పరమేశ్వరి- బాలా త్రిపుర సుందరి అలంకరణలో గంగమ్మ - మహాలక్ష్మికి, కామాక్షి అమ్మవారికి నిర్వహిస్తున్న తిరుమంజనం

పాకాల, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): నేంద్రగుంట మూలస్థానమ్మ దేవి ఆలయంలో ఘనంగా దసరా నవ రాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నారు. మంగళవారం అమ్మవారిని గాయత్రీ దేవి అలంకారంలో పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. ఆలయం, పరిసరాలలో విద్యుత్ దీపాలంకరణలు చేశారు.

భాకరాపేట: చిన్నగొట్టిగల్లులోని కన్యకా పరమేశ్వరి ఆలయంలో మంగళవారం అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కట్టమీద తిరుపతి గంగమ్మ బాలాత్రిపుర సుందరి అలంకరణలో దర్శనం ఇచ్చారు. కన్యకా పరమేశ్వరి అమ్మవారికి అష్టోత్తర పూజలు నిర్వహించారు.

రామచంద్రాపురం: రాయలచెరువుకట్ట భవానీ జలకంఠేశ్వర ఉపాలయాల్లో వెలసిన భవానీ అమ్మవార్లు, మహాలక్ష్మి అమ్మవారు, కామాక్షి అమ్మవారు బాలత్రిపురసుందరిదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం గణపతి హోమం నిర్వహించారు. శక్తి పీఠంలో మరకతశక్తి కాళీ అమ్మవారిని భగళాముఖి దేవిగా అలంకరించారు. పారకాల్వ శక్తి పీఠంలో రాజరాజేశ్వరి అమ్మవారిని సరస్వతిదేవిగా అలంకరించారు. కార్యక్రమంలో ఉభయదాత సర్పంచ్ కావ్య, వేణుగోపాల్‌నాయుడు దంపతులు పాల్గొన్నారు.

తిరుపతి రూరల్: తుమ్మలగుంట ఎల్ఎస్‌నగర్‌లోని శక్తిచాముండేశ్వరీదేవి అమ్మవారు కాత్యాయనిదేవి అలంకారంలో భక్తులను అనుగ్రహించారు. ఉభయదారులుగా ఎస్.సబిత, ఎస్.భాస్కర్‌రెడ్డి, ఎస్.కన్నెమ్మ, ఎస్.రాజశేఖర్ వ్యవహరించారు. ధర్మకర్త బిరుదాల భాస్కర్‌రెడ్డి పాల్గొన్నారు. తుమ్మలగుంట చెంచువారికాలనీలో మూలస్థాన యల్లమ్మ మంగళవారం కాత్యాయనిదేవి అలంకారంలో భక్తులకు అభయమిచ్చారు. ఉభయదారులుగా బిరుదాల ప్రదీప్‌కుమార్‌రెడ్డి, శ్రీశైల, సాయిరాంరెడ్డి, సౌజన్య, అశ్విని చంద్ర, ప్రవీణ్‌కుమార్‌రెడ్డి వ్యవహరించారు. ఆలయధర్మకర్త బిరుదాల సిద్దారెడ్డి అన్నదానసేవని నిర్వహించారు. దుర్గసముద్రంలో మూలస్థాన ఎల్లమ్మ రాజరాజేశ్వరీదేవి అలంకారంలో దర్శనమిచ్చారు.ఆలయధర్మకర్త లీలావతమ్మ పాల్గొన్నారు.









బాలత్రిపుర సుందరి దేవి అలంకారంలో భవానీ అమ్మవారు- తుమ్మలగుంటలో కాత్యాయనిదేవిగా చాముండేశ్వరిదేవి, మూలస్థాన యల్లమ్మ- దుర్గసముద్రంలో రాజరాజేశ్వరీదేవిగా మూలస్థాన ఎల్లమ్మ

శైలిపుత్రి అలంకరణలో ఉగ్రప్రత్యింగిరా దేవి



విశేషాలంకరణలో సంతోషిమాత

చంద్రగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మిట్టమీద గంగమ్మ ఆలయంలో దేవీనవాత్రి ఉత్సవాలకు మంగళవారం ధ్వజారోహణంతో శ్రీకారం చుట్టారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు నిర్వహించాక భక్తులకు దర్శనం కల్పించారు. కార్యక్రమంలో ధర్మకర్త మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు. శ్యామలాంబ సమేత మల్లేశ్వరాయంలోని సంతోషి మాత ఆలయంలో సాయంత్రం సహస్ర నామార్చన, చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు మొక్కల వెంకటరమణారెడ్డి, యారాశి చంద్రశేఖర్‌రెడ్డి, ఉభయదారులు సీతారామిరెడ్డి, మునిచంద్ర, ఓంకార్, మునికృష్ణారెడ్డి, అర్చకులు శివకుమార్ శర్మ, తదితరులు పాల్గొన్నారు. తొండవాడలోని ఉగ్రప్రత్యింగిరాదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారు శైలిపుత్రి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం శైలిపుత్రి హోమం నిర్వహించారు. ఆలయ పీఠాధిపతి సూరిస్వామి పాల్గొన్నారు.



1529మందికి చేరిన డీఎస్సీ విజేతలు



డీఈవో వరలక్ష్మి

చిత్తూరు సెంట్రల్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లాలో మెగా డీఎస్సీ ద్వారా కొత్తగా ఎంపికైన ఉపాధ్యాయుల సంఖ్య పెరిగినట్లు డీఈవో వరలక్ష్మి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ జోనల్ పరిధిలోని మోడల్ స్కూల్లో (పోస్టు గ్రాడ్యుయేట్ టీచర్స్, ట్రైండ్ గ్రాడ్యుయేట్ టీచర్స్) 121మంది టీచర్లు డీఎస్సీ ద్వారా ఎంపికైనట్లు తెలిపారు. వీరు కాక ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 1478 పోస్టులకు గాను 1408 మంది ఎంపికైన విషయం తెలిసిందే. ఇదే జాబితాలో జోనల్ పరిధిలో ఉమ్మడి చిత్తూరు జిల్లాకు సంబంధించి 121 మంది టీచర్ పోస్టులకు ఎంపిక కావడంతో మొత్తంగా 1529 మంది టీచర్లు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు రానున్నట్లు తెలిపారు. వీరందరికీ గురువారం అమరావతిలో నిర్వహించే బహిరంగ సభలో ముఖ్యమంత్రి చంద్రబాబు నియామక పత్రాలు అందజేయనున్నట్లు తెలిపారు.మెగా డీఎస్సీ ద్వారా ఎంపికైన అభ్యర్థులతో పాటు వారి సహాయకులను బుధవారం విజయవాడ తీసుకెళ్లేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. వీరితో పాటు విద్యాశాఖ సిబ్బంది, సహాయకులు కలుపుకుని ప్రయాణం చేసేందుకు వీలుగా 84 బస్సులు ఏర్పాటు చేశామన్నారు. ఒక్కో బస్సులో ఎంఈవో/హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీ, పీడీ/పీఈటీలను పర్యవేక్షకులుగా నియమించినట్లు తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు బుధవారం ఉదయం 7 గంటలకు తిరుపతి- రేణిగుంట రోడ్డులోని చదలవాడ రమణమ్మ ఇంజనీరింగ్ కళాశాల వద్దకు చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. వీరికి అవసరమైన సమాచారం అందించేందుకు వీలుగా హెచ్ఎం, స్కూల్ అసిస్టెంట్, ఎస్జీటీలుగా ఎంపికైన అభ్యర్థులకు విడివిడిగా వాటప్స్ గ్రూప్ ఏర్పాటు చేసి, ఎప్పుడు ఎక్కడికి ఎలా చేరుకోవాలి, విజయవాడలో ఏర్పాటు చేసిన గ్యాలరీలో ఎక్కడ, ఎవరు ఉండాలనే సమాచారం క్షుణ్ణంగా తెలియజేస్తున్నట్లు తెలిపారు. రెండు బ్యాచ్‌లుగా విభజించి, ప్రయాణ సమయంలో గూడూరు, ఒంగోలు ప్రాంతాల్లో భోజన ఏర్పాట్లు చేశామన్నారు.చిత్తూరు, తిరుపతి, మదనపల్లె, పుత్తూరు డీవైఈవోలు వీటన్నింటినీ పర్యవేక్షిస్తారన్నారు.

పోలీసు శాఖలో సంస్కరణలు!

- అనంతపురం ఎస్పీకి ఎస్‌బీ సీఐని అటాచ్ చేస్తూ ఆదేశాలు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పోలీసు శాఖలో సంస్కరణలు తీసుకొచ్చే దిశగా ఎస్పీ సుబ్బరాయుడు అడుగులు వేస్తున్నారు. రెండోసారి ఎస్పీగా ఆయన బాధ్యతలు చేపట్టిన రెండు రోజులకే ఇక్కడ ఆరేడు నెలలుగా ఎస్బీ సీఐగా పనిచేస్తున్న షాదిక్‌ఆలీని అనంతపురం ఎస్పీకి అటాచ్‌మెంటు ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు జిల్లాలోని దాదాపు ఐదారుగురు సీఐలకు స్థాన చలనం తప్పదని భావిస్తున్నారు. వీరిలో తిరుపతి కేంద్రంగా పనిచేస్తున్న వాళ్లు ఇద్దరు ఉన్నట్లు విశ్వసనీయ సమాచారం. ఎస్పీ కార్యాలయంలో దీర్ఘకాలంగా పనిచేస్తున్న విభాగాల హెడ్‌లు, సిబ్బందిని సైతం బదిలీ చేయాలనే ఆలోచనలో ఉన్నట్లు తెలిసింది. గతంలో తాను ఎస్పీగా ఉన్నప్పుడు.. తన ఆలోచనలకు అనుగుణంగా ఎవరెవరు పనిచేశారు? వారు ప్రస్తుతం ఎక్కడ వున్నారు? విమర్శలు, ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులు ఎవరు? తదితర వివరాలను ఎస్పీ ఆరా తీస్తున్నట్లు సమాచారం. తన ఆలోచనలకు అనుగుణంగా పనిచేసే టీమ్‌కు ప్రాధాన్యం ఇస్తున్నట్లు పోలీసు వర్గాలు తెలిపాయి. తాను బాధ్యతలు చేపట్టాక జాతీయ మహిళా సాధికారత సదస్సు, శ్రీవారి బ్రహ్మోత్సవాల్లో భద్రతా ఏర్పాట్లపై బిజీగా ఉండటంతో.. ఉత్సవాలు ముగిశాక పాలనపై దృష్టి కేంద్రీకరించి.. పూర్తిస్థాయిలో సంస్కరణలు చేపట్టనున్నట్లు సమాచారం.

నాగలచెరువులో పడి వ్యక్తి మృతి

చంద్రగిరి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దోర్నకంబాల పంచాయతీ పరిధిలోని నాగలచెరువు కుంటలో పడి ఓవ్యక్తి మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు.. మంగళవారం నాగలచెరువు కుంటలో ఓవ్యక్తి మృతదేహాన్ని గొర్రెల కాపరులు గుర్తించారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుడు రాయలపురం పంచాయతీ వెంకటంపేటకు చెందిన మునిరాజా(45)గా గుర్తించారు. ఇతనికి భార్య, పిల్లలు లేరు, తల్లిదండ్రులు చనిపోయారు. కూలి పనులు చేసుకునేవాడు. మద్యం తాగి మత్తులో కుంటలో పడి మృతిచెంది ఉంటాడని భావిస్తున్నారు. మృతదేహాన్ని ఎస్వీ మెడికల్ కళాశాలకు తరలించారు. కేసు నమోదు చేశారు.

మహిళకడుపులో 15 కిలోల కణితి తొలగింపు

- ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో అరుదైన శస్త్ర చికిత్స



శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న మహిళ

తిరుపతి (వైద్యం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): భారీ పరిమాణమున్న కణితి తొలగించి ఓ గర్భిణి ప్రాణాలు నిలబెట్టారు స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి వైద్యులు. అన్నమయ్య జిల్లా సుండుపల్లికి చెందిన 35 ఏళ్ల నాగమణి భర్తతో గల్ఫ్ వెళ్లింది. పెళ్లయిన 14 ఏళ్ల తరువాత గర్భందాల్చింది. నెలలు నిండే వరకూ అక్కడే వైద్యం పొంది కాన్పు కోసం ఇటీవల స్వగ్రామానికి వచ్చింది. సోమవారం పురిటినొప్పులు రావడంతో స్థానిక ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రిలో చేర్చారు. ప్రొఫెసర్, సీనియర్ గైనకాలజిస్టు డాక్టర్ మాధవిలు ఆమె పరిస్థితి చూసి అనుమానంతో వైద్య పరీక్షలు చేశారు. అండాశయంలో మ్యూసినస్ సిస్టడినోమా అనే 15 కిలోల కణితి ఉన్నట్లు గుర్తించారు. దీనికితోడు హైపోథైరాయిడ్, కామెర్లు వచ్చాయి. వైద్య బృందం అతికష్టం మీద శస్త్ర చికిత్స చేసి కాన్పు చేశారు. నాగమణి 3 కిలోల బరువున్న ఆడ శిశువును ప్రసవించింది. అరుదైన శస్త్ర చికిత్స చేసి కడుపులోని 15 కిలోల కణితి గడ్డను కూడా తొలగించారు. .శస్త్ర చికిత్సల అనంతరం కోలుకోవడంతో ఆమె కుటుంబ సభ్యులు వైద్య బృందానికి కృతజ్ఞతలు తెలిపారు. డాక్టర్ మాధవి బృంధాన్ని ఎస్వీ వైద్య కళాశాల ప్రిన్సిపల్ రవిప్రభు, సూపరింటెండెట్ ప్రమీళాదేవి అభినందించారు.

ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్ పరిశీలన



ఐసీసీసీలో చైర్మన్, అదనపుఈవో, బోర్డు సభ్యులు

తిరుమల, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని వైకుంఠం క్యూకాంప్లెక్స్-1లో ఏర్పాటు చేసిన ఏఐ కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను(ఐసీసీసీ) టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి మంగళవారం పరిశీలించారు. దాతల సహకారంతో ఏర్పాటు చేసిన ఈ సెంటర్‌ను సీఎం చంద్రబాబు నాయుడు గురువారం ప్రారంభించనున్నారు. ఈక్రమంలో చైర్మన్, సభ్యులకు సెంటర్ పనితీరును వివరించారు. ఐసీసీసీలో దాదాపు 25 మంది విధులు నిర్వహిస్తారన్నారు. భారీ డిజిటల్ స్క్రీన్ ద్వారా సీసీ కెమెరాల ఫుటేజ్‌ను చూడవచ్చన్నారు. ప్రత్యేక కెమెరాలతో అలిపిరి నుంచే భక్తుల రద్దీని ఏఐ అంచనా వేస్తుందన్నారు. క్యూలైన్‌లో ఎంతమంది ఉన్నారు, ఎంత సమయం నుంచి ఉన్నారు, ఎప్పటికి దర్శనం అవుతుంది వంటి అంశాలను తెలుపుతుందన్నారు. చోరీలతో పాటు ఇతర అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకుంటే వెంటనే తెలుసుకోవచ్చన్నారు. , తప్పిపోయిన వారిని కూడా గుర్తించవచ్చన్నారు. భక్తుల ముఖ కదలికలు(హావభావాలు)ఆధారంగా వారి ఇబ్బందులు కూడా తెలుసుకోవచ్చని, రద్దీ ప్రాంతాలను రెడ్ స్పాట్లుగా చూపడంతో ఈ వ్యవస్థ కీలకంగా వ్యవహరిస్తుందన్నారు. సైబర్ దాడులు, టీటీడీపై సోషల్ మీడియాతో జరిగే తప్పుడు ప్రచారాలకు ఐసీసీసీ అడ్డుకట్ట వేస్తుందని ఆయన వివరించారు.



తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం సాయంత్రం జరిగిన విష్వక్సేనుడి ఊరేగింపులో పాల్గొన్న టీటీడీ చైర్మన్ బీఆర్ నాయుడు, ఈవో సింఘాల్, అదనపు ఈవో వెంకయ్య చౌదరి, బోర్డు సభ్యులు, అధికారులు

కలెక్టర్‌కు టీడీపీ నేతల అభినందన



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): స్వర్ణనారావారిపల్లె ప్రాజెక్టులో భాగంగా స్కోచ్ సంస్థ నుంచి గోల్డెన్ పురస్కారం అందుకున్న కలెక్టర్ వెంకటేశ్వర్‌ను మంగళవారం పలువురు టీడీపీ నేతలు కలెక్టరేట్‌లో సత్కరించారు. రాష్ట్ర గ్రీనరీ, బ్యూటిఫికేషన్ చైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్‌సీమునికృష్ణ, టీడీపీ నేతలు చిన్నబాబు, బుల్లెట రమణ, మన్యం శ్రీనివాసులు, మునిశేఖర్‌రాయల్, సందీప్, రేవతి, సూర్యకుమారి, సుజాతమ్మ, అనిత, హేమావతి తదితరులు సత్కరించిన వారిలో ఉన్నారు.

అధునాతన పద్ధతిలో న్యూరో, ఆర్థో సర్జరీ చికిత్సలు




ఆర్థోసర్జన్ డాక్టర్ డీ.బీ.శశిధర్‌రెడ్డి

తిరుపతి(వైద్యం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): న్యూరో, ఆర్థో శస్త్ర చికిత్సలకు రమాదేవి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రిలో అధునాతన వైద్య సదుపాయాలు అందుబాటులో ఉన్నాయని ప్రముఖ ఆర్థోసర్జన్ డాక్టర్ డీ.బీ. శశిధర్‌రెడ్డి తెలిపారు. టీనగర్ వీధిలోని రమాదేవి ఆస్పత్రిలో ఆయన మంగళవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి న్యూరో, ఆర్థో సమస్యలతో బాధపడే వారికి ఉచితంగా శస్త్ర చికిత్సలు అందిస్తున్నామన్నారు. అత్యవసర వైద్యం కోసం బాధితులకు ఐదు కిలోమీటర్ల దూరం వరకు ఉచిత అంబులెన్సు సౌకర్యాన్ని కూడా కల్పిన్నామన్నారు. తెగి పడిన శరీర భాగాలతో బాధపడే వారిని సకాలంలో తీసుకువస్తే వాటిని మునుపటిలా అమర్చుతున్నారు. సంక్లిష్టమైన సర్జరీలను సైతం ఆరోగ్యశ్రీ, ఈహెచ్‌ఎస్, ప్రయివేటు ఇన్సూరెన్స్ వంటి వాటితో పూర్తి ఉచితంగా నిర్వహిస్తామన్నారు. తాము అందిస్తున్న అధునాతన వైద్యసేవలు, అందుబాటులో ఉన్న అధునాతన పరికరాలను గురించి ఆయన వివరించారు.

విద్యుత్ స్టోర్స్ హమాలీల రిలే దీక్షలు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): సదరన్ డిస్కం జిల్లా స్టోర్స్‌లో హమాలీల డబ్బుల్లో వాటా కావాలని కోరుతున్న చిత్తూరు, అనంతపురం జిల్లాల్లోని కొందరు ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి చంద్రబాబు చర్యలు తీసుకోవాలని సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కందారపు మురళి డిమాండ్ చేశారు. సదరన్ డిస్కం కార్యాలయం వద్ద మంగళవారం విద్యుత్ స్టోర్స్ హమాలీల రిలే నిరాహార దీక్షలను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హమాలీల సంపాదనలో వాటా ఇవ్వాలని అడగడం దిగజారుడుతనమని మండిపడ్డారు. దీక్షల్లో ఆ సంఘం నాయకులు ఆర్యోగ్య దాస్, కుమార్, శివశంకర్, చలపతి, శ్రీనివాసులు, సుబ్బారావు, వేంకటేశ్వర్లు, రమేష్, నాగమణి, జయచంద్ర తదితరులు పాల్గొన్నారు.

యువత సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలి



జయరాంప్రసాద్‌ను సన్మానిస్తున్న అధ్యాపకులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): యువ తరంచదువుతో పాటు సామాజిక సేవలో భాగస్వామ్యం కావాలని రోటరీ క్లబ్ ప్రతినిధి వేమూరి జయరాం ప్రసాద్ పేర్కొన్నారు. పద్మావతి డిగ్రీ కాలేజీలో మంగళవారం నిర్వహించిన ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ నివారణకు కృషి చేయాలన్నారు. పచ్చదనాన్ని పెంపొందించాలన్నారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం పని చేయాలన్నారు. ప్రిన్సిపాల్ నారాయణమ్మ, ఎన్‌ఎస్‌ఎస్ ఆఫీసర్ కృష్ణవేణి, అధ్యాపకులు కస్తూరి, శోభ, అన్నమ్మ, దివ్యవాణి పాల్గొన్నారు.

మహిళలకు వైద్య పరీక్షలు

తిరుపతి(ఆటోనగర్): మహిళలు తమ ఆర్యోగ్యంపై దృష్టి సారించలని పద్మావతి విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డాక్టర్ డి.హైమావతి అన్నారు. స్థానిక రాస్ సేవానిలయంలో మంగళవారం రాస్, టాటాట్రస్ట్, పద్మావతి విశ్వవిద్యాలయంలు సంయుక్తంగా మహిళలకు ఉచితంగా క్యాన్సర్ గుర్తింపు పరీక్షలు నిర్వహించారు. రాస్ డైరెక్టర్ వి.నాగరాజు మాట్లాడుతూ రాస్ మహిళలకు తరచూ క్యాన్సర్ పరీక్షలు చేయిస్తున్నామని చెప్పారు. 120 మంది మహిళలకు వైద్యపరీక్షలు చేశామని టాటా ట్రస్ట్ అధికారి హేమంత్ అన్నారు.

రేపు రెండు ద్విచక్ర వాహనాల వేలం

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నేరాల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను గురువారం సాయంత్రం తిరుపతి రూరల్ ఎక్సైజ్ సీఐ కార్యాలయంలో వేలం వేయనున్నారు. ఆ శాఖ సీఐ నరసనాయుడు మంగళవారం ఈ మేరకు ఆయన మీడియాకు ప్రకటన విడుదల చేశారు. మిగిలిన వివరాలకు నేరుగా రూరల్ సీఐని సంప్రదించవచ్చన్నారు.

రవికుమార్‌ను కస్టడీలోకి తీసుకోవాలి

● బీజేపీ నేత నవీన్‌కుమార్‌రెడ్డి



తిరుపతి(జీవకోన), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పరకామణి కేసులో నిజాలు నిగ్గు తేల్చాలని బీజేపీ నేత నవీన్ కుమార్ రెడ్డి కోరారు. పరకామణిలో చోరీ చేసిన రవికుమార్ జియ్యర్ స్వామి మఠంలో పనిచేసినప్పటి వివరాలపై ఆరా తీయాలన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. రవికుమార్‌ను హైకోర్టు ఆదేశాల మేరకు సీబీసీఐడీ అధికారులు వెంటనే కస్టడీలోకి తీసుకోవాలన్నారు. విదేశాలకు పారిపోకుండా పాస్‌పోర్టు సీజ్ చేయాలన్నారు. చోరీ కేసులో నిజనిజాలు నిగ్గు తేలే వరకు రవికుమార్‌తో పాటు కుటుంబ సభ్యులకు పోలీసు రక్షణ కల్పించాన్నారు. అనేక సంవత్సరాలుగా జరుగుతున్న ఈ బాగోతాన్ని టీటీడీ పూర్వపు ఉన్నతాధికారులు, విజిలెన్సు నిఘా వ్యవస్థ గుర్తించకపోవడం బాధ్యాతారాహిత్యమన్నారు. వారిని కూడా విచారణలో భాగస్వాములుగా చేర్చాలన్నారు.

ర్యాగింగ్ వ్యతిరేక ప్రచారం



పోస్టర్లు విడుదల చేస్తున్న దృశ్యం

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): జాతీయ సంస్కృత యూనివర్సిటీలో ర్యాగింగ్ వ్యతిరేక ప్రచారాన్ని చేపట్టారు. ఈక్రమంలో మంగళవారం విజిలెన్స్ ఆఫీసర్‌సత్యనారాయణాచార్యసాహిత్య విభాగాధ్యక్షుడు రాజగోపాలన్, తదితరులు పోస్టర్లు ఆవిష్కరించారు. విద్యార్థులు ర్యాగింగ్‌కు దూరంగా ఉండాలని వారు కోరారు. ర్యాగింగ్‌కు పాల్పడితే కఠిన చట్టాలు అమలులో ఉన్నాయన్నారు. కార్యక్రమంలో అధికారులు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

అమ్మవారికి అలంకార వెలుగులు



బాలాత్రిపుర సుందరి అలంకారంలో నడివీధి గంగమ్మ, వేశాలమ్మ వార్లు, దుర్గాదేవి అలంకరణలో అన్నపూర్ణదేవి

● కుంభకలశం మహాలక్ష్మిదేవిగా వాసవి కన్యకాపరమేశ్వరిదేవి ● అన్నపూర్ణేశ్వరి దేవి అలంకరణలో బొంతాలమ్మ

తిరుపతి(కల్చరల్), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): తాతయ్యగుంట గంగమ్మ మంగళవారం బాలాత్రిపుర సుందరి అలంకారంలో దర్శనమిచ్చారు. శరన్నవ రాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయంలో అమ్మవారి మూలవిరాట్లుకు ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించి సర్వాంగ సుందరంగా అలంకరించారు. సాయంత్రం బాలాత్రిపుర సుందరి అలంకారం చేసి ఊంజల్ సేవ నిర్వహించారు. కోర్టు సమీపంలోని వేశాలమ్మ ఆలయంలో అమ్మవారికి బాలాత్రిపుర సుందరి అలంకారం చేశారు. గాంధీవిగ్రహం వద్ద పెద్దగంగమ్మఅమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకారంలో, పాత మున్సిపల్ ఆఫీసు ప్రాంతంలోని నడగివీధి గంగమ్మ బాలాత్రిపుర సుందరిగా, కపిలేశ్వరస్వామి ఆలయంలో కామాక్షి అలంకారంలో దర్శనమిచ్చారు.

తిరుపతి అర్బన్: స్థానిక లక్ష్మీపురం కూడలిలోని అన్నపూర్ణదేవి సమేత కాశీవిశ్వనాథస్వామి, కొత్తవీధిలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయంలో శాస్త్రోక్తంగా పూజలు చేశారు. రాత్రి అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. వాసవి కన్యకాపరమేశ్వరి మీనాక్షిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు.

తిరుపతి(జీవకోన): అన్నపూర్ణేశ్వరి దేవి అలంకారంలో బొంతాలమ్మ భక్తులకు దర్శనమిచ్చింది. .

ఫిజిక్స్‌లో మార్పులు,చేర్పులపై అవగాహన అవసరం



సదస్సులో పాల్గొన్న వీసీ శ్రీనివాసరావు, మాజీ వీసీ మురళి, ప్రొఫెసర్ దేవప్రసాదరాజు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): కాలానుగుణంగా ఫిజిక్స్‌లో వస్తున్న మార్పులూ చేర్పులను విద్యార్థులు అవగాహన చేసుకోవాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పద్మావతి మహిళా యూనివర్సిటీ ఫిజిక్స్ విభాగంలో మంగళవారం ఒక్క రోజు వర్క్‌షాప్ చేపట్టారు. స్పెక్ట్రోస్కోపీ ఫండమెంటల్స్ - పొటెన్షియల్ అప్లికేషన్స్ అంశంపై ఈ కార్యక్రమం నిర్వహించారు. విక్రమసింహపురి యూనివర్సిటీ వీసీ శ్రీనివాసరావు, ఎస్వీయూ మాజీ వీసీ మురళి, మాజీ రెక్టార్ సీకే జయశంకర్, ఎస్వీయూ ఫిజిక్స్ విభాగాధిపతి దేవప్రసాదరాజు, రేర్ ఎర్త్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా అధ్యక్షులు ఎంఎల్‌పీ రెడ్డి, తదితరులు పాల్గొని మాట్లాడారు. ఫిజిక్స్ ఆధారంగా సమాజంలోని వివిధ రంగాల్లో ఎన్నో మార్పులు వచ్చాయన్నారు. కార్యక్రమంలో వాయల్పాడు ఎన్టీఆర్ డిగ్రీ కాలేజీ ప్రిన్సిపాల్ బాబు, పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'లోక్ కల్యాణ మేళా'ను సద్వినియోగం చేసుకోండి

తిరుపతి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం రూపొందించిన లోక్ కల్యాణ మేళాను వీధి విక్రయదారులు సద్వినియోగం చేసుకోవాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ జె. ఎఫ్రాయిం కోరారు. మెప్మా ఆధ్వర్యంలో వీధి విక్రయదారులు మంగళవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో సమావేశం జరిగింది.. పీఎం స్వనిధి 2.0లో భాగంగా మొదట విడత రూ15వేలు, రెండవ విడత రూ.25వేలకు పెంచుతున్నారని పీడీ తెలిపారు. తిరుపతిలో 1835 వీధి విక్రయదారులకు వివిధ దశలలో మంజూరు చేసిన యూనిట్లు ఏర్పాటు చేయవలసి ఉందన్నారు. డిజిటల్ ప్రోత్సాహకాలతో పాటు రుణాలపై క్రెడిట్ హామీ, వడ్డీ సబ్సిడీ ఉంటుందన్నారు. డిజిటల్ లావాదేవీని ప్రారంభించడానికి యూపీఐ లింక్ చేయాల్సిన రూపే క్రెడిట్ కార్డును గరిష్టంగా రూ30వేల పరిమితితో అందిస్తారని తెలిపారు. లేబర్ ఆఫీసర్ రంగనాథ్ మాట్లాడుతూ ఈ పథకం ద్వారా ప్రతి అసంఘటిత రంగ కార్మికులు ప్రయోజనం పొందవచ్చునని తెలిపారు. ఆరోగ్య శాఖ డీటీవో శాంతకుమారి స్త్రీల ఆరోగ్యం, సమస్యల పరిష్కారాలను వివరించారు. ఐసీడీఎస్ సుధారాణి, మెప్మా టీఈ ప్రమీల, సిటీ మిషన్ మేనేజరులు యస్.కృష్ణవేణి, సోమకుమార్ పాల్గొన్నారు.

నేడు పని గంటల పెంపునకు వ్యతిరేకంగా నిరసనలు

తిరుపతి(ఆటోనగర్), సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం పని గంటలు పెంచుతూ తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ బుధవారం జిల్లాలో సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి కోరారు. కేంద్రంలో మోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై ప్రభుత్వం అసెంబ్లీలో ఒక మాట కూడా చర్చించకుండా సంతకం చేసి అమలు చేయడం కార్మిక లోకానికి గొడ్డలి పెట్టులాంటిదన్నారు. .

అంతర కళాశాల కబడ్డీ టోర్నీ విజేత ఎస్వీ ఆర్ట్స్ కాలేజి



కబడ్డీ విజేత జట్టు

తిరుపతి అర్బన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎస్వీయూ అంతర కళాశాల పురుషల కబడ్డీ టోర్నమెంట్‌లో ఎస్వీ ఆర్ట్స్ కాలేజీ టీం విజేతగా నిలిచింది. మంగళవారం ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఫిజికల్ ఎడ్యుకేషనల్ డైరెక్టర్ ఎం.శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎస్వీయూ వైస్‌చాన్సలర్ సి.హెచ్.అప్పారావు హాజరై పోటీలను ప్రారంభించారు. వివిధ కళాశాల నుంచి 25జట్లు ప్రాతినిధ్యం వహించాయి. తుదిపోరులో ఎస్వీ ఆర్ట్స్ కళాశాల జట్టు జయకేతనం ఎగురవేసింది. రిజిస్ట్రార్ ప్రొఫెసర్ భూపతినాయుడు విజేత, రన్నరప్ జట్ల క్రీడాకారులకు మెడల్స్, ట్రోఫీని బహూకరించారు. టోర్నీకి చిత్తూరు జిల్లా డీఎస్‌డీవో బాలాజీ, ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఫిజికల్ డైరెక్టర్ పి.సత్యనారాయణ, ఎ.నరసింహరావు, కిషోర్, రెడ్డిభాస్కర్, లక్ష్మీరాజ్యం, గోవర్ధన్, గఫూర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఓటరు జాబితా అనుసంధానం పూర్తి చేయండి



మాట్లాడుతున్న కమిషనర్ మౌర్య

తిరుపతి, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి) : 2002-ఓటరు జాబితాతో 2025 జాబితాను ఈ నెల 26లోపు అనుసంధానం చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ .మౌర్య బీఎల్వోలను ఆదేశించారు. ఓటరు జాబితా అనుసంధానం చేసే విధానంపై స్థానిక కచ్చపి ఆడిటోరియంలో మంగళవారం బీఎల్వోలకు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ బూత్ లెవెల్ అధికారులు ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని అన్నారు. 35 సంవత్సరాలు నిండిన వారి జాబితాను అందజేశామన్నారు. ఈ రెండు సరిపోల్చుకుంటూ ఎవరెవరు ఎక్కడ ఉన్నారనేది గుర్తించాలన్నారు. పీ4సర్వేపై సచివాలయ కార్యదర్శులకు డిజిటల్ శిక్షణ ఇచ్చారు. సమావేశంలో డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవెన్యూ ఆఫీసర్ రవి, తహసీల్దార్ సురేష్ బాబు, సిబ్బంది, బీఎల్వోలు పాల్గొన్నారు.

రేపు పద్మావతి వర్సిటీలో నవరాత్రి వేడుకలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పద్మావతి యూనివర్సిటీలో గురువారం నవరాత్రి వేడుకలు నిర్వహించనున్నారు. మధ్యాహ్నం 3 గంటలకు గాంధీ విగ్రహం వద్ద వేడుకలు నిర్వహించనున్నట్లు వర్సిటీ కల్చరల్ కో-ఆర్డినేటర్ ప్రొఫెసర్ శైలేశ్వరి తెలిపారు.

వ్యక్తిగత శుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించండి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని కలెక్టర్ వెంకటేశ్వర్ సూచించారు. స్వచ్ఛతా హీ సేవ-2025 కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో మంగళవారం పోస్టర్లను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబరు 2వ తేదీ వరకు స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. పాఠశాలలో విద్యార్థులు ప్రతిరోజు చేతులు పరిశుభ్రంగా ఉంచుకునేలా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి నరేంద్రకుమార్, డీపీవో సుశీలాదేవి, ఎంఐఎస్ మోహన్‌రాజు తదితరులు పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్ తదితరులు



సిద్ధమైన సైకత శిల్పం

అలాగే ఈసారి 'వైకుంఠంలోని విమాన వేంకటేశ్వరస్వామి గోపురాన్ని తిరుమలకు తెస్తున్న గరుడుడు' అనే అంశంపై సాండ్ ఆర్ట్‌ను కూడా సిద్ధం చేశారు.

సర్వదర్శనానికి 8 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 8 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 21 కంపార్టుమెంట్లలో సర్వదర్శన భక్తులు, వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.4.06 కోట్లు
సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 60,681
తలనీలాలు సమర్పించినవారు: 19,510



అఖిలాండకోటి బ్రహ్మాండనాయకుడిగా తిరుమల శ్రీవేంకటేశ్వరుడిని భక్తజనం కొలుస్తారు. దేశం నలుమూలల నుంచీ తండోపతండాలుగా తరలివస్తారు. స్వామి వైభవాన్ని చూసి తరిస్తారు. వెయ్యేళ్లుగా తిరుమల ఆలయంలో కొనసాగుతున్న పూజా కైంకర్యాలు, స్వామికి అలంకరించే ఆభరణాలు, అనుసరిస్తున్న ఆచార సంప్రదాయాలు.. వెనుక ఆయన భక్తాగ్రేసరులు ఎందరో ఉన్నారు. చక్రవర్తుల మొదలు సామాన్యుల దాకా ఆయన సేవలో తరించి అనుగ్రహం అందుకున్నారు.. అందులో కొందరి గురించి బ్రహోత్సవాల సందర్భంగా స్మరించుకుందాం..





చిత్రం: పి.రమేష్, శ్రీకాళహస్తి

శ్రీవారి సర్వసేనాని

తిరుమల శ్రీవారి ఆలయంలో వైకుంఠప్రదక్షిణ ద్వారానికి పక్కన చిన్న మందిరంలో దక్షిణాభిముఖంగా విష్వక్సేనుడి శిలాప్రతిమ ఉంటుంది. ఆణివార ఆస్థానంలోను, ఉగాది, దీపావళి ఆస్థానాల్లోను, బ్రహ్మోత్సవాల్లోను, విశేష తిరువీధి ఉత్సవాల్లోను పంచ ఆయుధాలు ధరించిన పంచలోహ విష్వక్సేనుడు మాడవీధుల్లో ఊరిగి ఏర్పాట్లను పర్యవేక్షిస్తాడు. శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రధాన సైన్యాధిపతి ఈయన. విష్వక్సేనుడు అంటే అంతటా వ్యాపించిన సేన కలవాడు అని అర్థం. 'విష్వక్సేనో జనార్దనః' అని అమరం పేర్కొంటుంది. విష్వక్సేనుడు అనే పేరు విష్ణుదేవుని సేనాపతికీ ఉంది. విష్ణుదేవుడే తన సైన్యాల కోసం తానే సేనాపతిగా అవతరించి విష్వక్సేనుడు అయ్యాడు అంటారు. కాకపోతే వేరొకరు జగన్నాయకుని సేనలకు ఆధిపత్యం వహించగలరా? మంగళవారం అంకురార్పణ రోజున ఆయన మాడవీధుల పర్యవేక్షణ తర్వాతే బ్రహ్మోత్సవ సంరంభం ఆరంభం అయ్యింది.

భగవద్బంధువులు శ్రీవారి సేవకులు

చైర్మన్ బీఆర్ నాయుడు




తిరుమల, సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులకు సేవలు అందిస్తున్న శ్రీవారిసేవకులు భగవద్బంధువులు అని టీటీడీ బోర్డు చైర్మన్ బీఆర్ నాయుడు అన్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు సేవలందించేందుకు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన శ్రీవారిసేవకులతో తిరుమలలోని ఆస్థానమండపంలో మంగళవారం ఆయన ఆత్మీయ సమావేశం నిర్వహించారు. 'తిరుమలకు వచ్చే భక్తుల్లోనే భగవంతుడు ఉన్నాడు. వారికి సేవ చేస్తే భగవంతుడికి సేవ చేసినట్లే' అన్నారు. దేశంలోని ఎంతోమంది ప్రముఖులు శ్రీవారి సేవ చేసేందుకు ఉత్సాహం చూపిస్తున్నారన్నారు. శ్రీవారిసేవకులకు ప్రస్తుతం కల్పిస్తున్న సాధారణ దర్శనం స్థానంలో స్వామిని మరింత దగ్గరగా దర్శించుకునేలా ఏర్పాట్లు చేయాలని అధికారులను అధికారులను కోరారు. దీనిపై బోర్డులో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు. బోర్డు సభ్యుడు నరేష్‌కుమార్, సీవీఎస్వో మురళీకృష్ణ, డీఎఫ్‌వో ఫణికుమార్ నాయుడు, సీపీఆర్వో రవి, ఇతర అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

అంగరంగ వైభవంగా జరిగే శ్రీవేంకటేశ్వరుని బ్రహ్మోత్సవాలకు సకల దేవతలనూ ఆహ్వానిస్తూ ఆలయంలో ఎగరేసేదే ధ్వజపటం. ఆహ్వానం పలికేవాడు గరుడుడు. కొడితాడు సాయంతో ధ్వజస్తంభం శిఖరానికి చేర్చి ఎగరేసే కార్యక్రమమే ధ్వజారోహణం. బ్రహ్మోత్సవాలు జరిగే తొమ్మిది రోజులూ రెపరెపలాడే ధ్వజపటం నుంచి గరుడుడు వేడుకలను వీక్షిస్తుంటాడు. పసుపువర్ణంతో ఎగిరే ఈ పతాకం మీద రెక్కలు విప్పుకుంటూ ఒక కాలు నేలకు ఆన్చి మరో కాలు గాల్లోకి లేస్తున్నట్టుగా గరుడుడి చిత్రం ఉంటుంది. తొమ్మిది అడుగుల ధ్వజపటాన్ని 40 ఏళ్లుగా రూపొందించే అరుదైన అవకాశం తిరుపతి చిత్రకారుడికి దక్కింది. ఆయనపేరు శ్రీవశ్రీ. పూర్తి పేరు పేరూరు శివప్రసాద్. టీటీడీ చిత్రకారుడిగా సుప్రసిద్ధుడు. 40వ ధ్వజపటచిత్రాన్ని సోమవారం నాడు తిరుమల ఆలయంలో స్వామి పాదాల ముందుంచి అధికారులకు అప్పగించిన శివశ్రీ ఆంధ్రజ్యోతితో పంచుకున్న విశేషాలు...

- ఆంధ్రజ్యోతి - తిరుపతి

ధ్వజపటం వేయడం అన్నది చిత్రకళకు మాత్రమే పరిమితమైనది కాదు. అదొక దివ్యానుభూతి. స్వామితో ఏర్పడిన ఆత్మిక బంధం. ఈ పనికి ఆయన నన్ను ఎంచుకున్నాడు. నా ప్రయత్నం మాత్రమే అయితే 40 ఏళ్లు నిర్విఘ్నంగా సాగేదేనా?!



శ్రీవారికి

శివశ్రీ చిత్రకైంకర్యం

40 ఏళ్లుగా ధ్వజపటం సమర్పిస్తున్న చిత్రకారుడు

నిష్ఠతో మూడు రోజులు

గరుడపటం కోసం మూడుకి 9 అడుగుల నిడివి ఉండే తెల్లని మెత్తని వస్త్రంను ఎంచుకుంటాం. పసుపులో ఒక రోజంతా ఆ గుడ్డను నానబెట్టాలి. ఆ తర్వాత నిమ్మ ఉప్పులో ఒక గంట ఉంచాలి. ఆరిన తర్వాత చిత్రరచన మొదలవుతుంది. నా శ్రీమతి పసుపు అద్దకం పూర్తయ్యాక ఒక గదిలో మూడు రోజులు నిష్ఠతో నేను మాత్రమే చేసే కార్యం ఇది. బొగ్గు, ఎర్రమట్టి, నామం కొమ్ము, తిరుచూర్ణం ఇందుకు వినియోగిస్తాం. క్రీడాఉద్యానవనాన్ని భూమి మీదకు దించినవాడు గరుడుడు. భూమితో ఆయనకున్న అనుబంధానికి సంకేతంగానే ఎర్రమట్టిని చిత్రరచనలో వాడుతారు. నామంతెలుపు రంగునూ, తిరుచూర్ణం ఎరుపునూ ఇస్తాయి.

1986 నుంచి మొదలు

1979లో టీటీడీలో నేను చేరాను. రిటైరైన తర్వాత కూడా గరుడపటం గీసే అదృష్టం నాకు ఆ స్వామి ఇచ్చాడు. 1986 నుంచీ నేను గరుడచిత్రం గీస్తున్నాను. అంతకు మునుపు టీటీడీకి సంబంధంలేని బయటి చిత్రకారులు దీనిని రూపొందించేవారు. భక్తి శ్రద్ధలతో, నియమనిష్ఠలతో చేయాల్సిన పని ఇది. టీటీడీలో అటువంటి చిత్రకారులు లేరా అని అప్పటి ఆలయ అధికారులు బ్రహ్మోత్సవాల నిర్వహణపై ముందస్తుగా నిర్వహించిన సమావేశంలో అన్నారట. ఉన్నారని భరోసా ఇచ్చినవారు డాలర్ శేషాద్రి. నాకు మంచి మిత్రుడు. నిజానికి ఈ అవకాశం మొదట హెన్రీ గారికి వచ్చింది. ఆయనే నాపేరును సూచించారు. తొలిసారి చిత్రం ప్రారంభించే ముందు జియ్యంగార్లు, ఆలయ అర్చకులు నన్ను కూర్చోబెట్టుకుని గరుడ పటం విశిష్టత గురించి, గరుడుడి ప్రాధాన్యం గురించి చాలా వివరించారు. భక్తితో చేయాల్సిన పని అంటూ అప్పగించారు. అలా మొదలైన గరుడచిత్రకైంకర్యం 40 ఏళ్లుగా కొనసాగుతోంది. స్వామి తనకు సేవచేసేందుకు కొందరిని ఎంచుకుంటాడు. అలాంటివారిలో బహుశా నేనూ ఒకడిని. లేకపోతే రిటైరైన తర్వాత కూడా ఈ అపురూప అదృష్టం నాకు దక్కేదా?



సర్పాలే ఆభరణాలు

చిత్రంలోని గరుడుడికి అలంకారాలుగా అమరేది అష్టమహా సర్పాలు. శిరస్సున కిరీటంలా మారిన శంకువును అల్లుకుని సర్పాలుంటాయి. చెవి రింగులుగా పద్మ, మహాపద్మాలు, కంఠాభరణంగా కర్కోటకుడు, యజ్ఞోపవీతంగా వాసుకి, నడుమును చుట్టుకుని తక్షకుడు, కుడి, ఎడమ చేతులకు కంకణాలుగా గుళికుడు, అనంతుడు ఆభరణాలుగా ఉంటారు.





90 వేల మొక్కలతో పుష్పప్రదర్శన శాల

తిరుమలలోని కల్యాణవేదిక వద్ద ఎప్పటిలానే ఫల పుష్ప ప్రదర్శన శాల సిద్ధమైంది. దాదాపు 90 వేల మొక్కలను ఈసారి ప్రదర్శనలో ఉంచారు. ఇందులో 18 రకాల పుష్పమొక్కలను వివిధ రంగుల్లో ఒకేచోట చూసే అవకాశం భక్తులకు లభించనుంది. ఇక, పండ్లు, కూరగాయలతో పక్షులు, జంతువులను ఏర్పాటు చేశారు. శ్రీరాముడిపైనే యుద్ధానికి సిద్ధపడిన హనుమంతుడు, భీముడు-బకాసురుడి యుద్ధం, శ్రీరాముడు ద్వితీయ వివాహం చేసుకున్నాడనే సీతమ్మ అనుమానాన్ని నివృత్తి చేస్తున్న వాల్మీకి మహర్షి, ఇంద్రుడితో యుద్ధం చేస్తున్న శ్రీకృష్ణార్జునులు, లంకిణి అనే రాక్షసి నోట్లోకి ప్రవేశిస్తున్న ఆంజనేయుడు, లంకాదహనం, విష్ణువుకు పవళింపుసేవ చేస్తున్న ఆంజనేయుడు, ఘటోత్కజుడు, చిన్నకృష్ణుని లీలలు, శ్రీకృష్ణుణి తులాభారం, అహంకార భక్తికంటే ఆత్మశుద్ధితో పూజించేవారికే తాను విధేయుడని నిరూపిస్తున్న స్వామి.. ఇలా పురాణాల్లోని దాదాపు 14 ఘట్టాలను కళ్లకు కట్టినట్టు చూపే సెట్టింగులు వేశారు. ఈప్రదర్శనశాల గురువారం నుంచి భక్తులకు అందుబాటులోకి రానుంది.

- తిరుమల, ఆంధ్రజ్యోతి







అధ్యక్షా..

గూడూరును జిల్లాగా ప్రకటించాలి



గూడూరు నుంచి జిల్లా కేంద్రమైన తిరుపతి 100 కిలోమీటర్ల దూరంలో ఉంది. స్థానికులు, అధికారులు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే వ్యయప్రయాసలకు గురవుతున్నారు. ఎన్నికల సమయంలో గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. ఆ హామీ మేరకు నెల్లూరు జిల్లాలో కలపాలి. లేదా గూడూరు కేంద్రంగా జిల్లాగా ప్రకటించాలి.

- పాశం సునీల్‌కుమార్, గూడూరు ఎమ్మెల్యే

ట్రామాకేర్ సెంటర్ కావాలి



సూళ్లూరుపేట నియోజకవర్గంలో సుదీర్ఘమైన జాతీయ రహదారి ఉంది. ప్రమాదాల సమయంలో అత్యవసర వైద్యం కోసం నెల్లూరు, తిరుపతి, చెన్నై వెళ్లాల్సి రావడం ఇబ్బందిగా ఉంది. అందుకని నాయుడుపేట లేదా సూళ్లూరుపేటలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలి. సీహెచ్‌సీలు, పీహెచ్‌సీ, యూహెచ్‌సీని అప్‌గ్రేడ్ చేయాలి. ఆస్పత్రుల్లో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి.

- నెలవల విజయశ్రీ, సూళ్లూరుపేట ఎమ్మెల్యే

గ్రీన్ అంబాసిడర్లకు జీతాలేవీ?



ఇంటింటికి తిరిగి చెత్త సేకరించే గ్రీన్ అంబాసీడర్లకు ఆరు నెలలుగా జీతాలు అందలేదు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని ముక్కంటి ఆలయానికి అనుసంధానం చేస్తే రోగులకు అన్ని రకాల మౌలిక సదుపాయాలు కల్పించేందుకు వీలవుతుంది. పశువుల షెడ్లు, ఉపాధి హామీ పథకం కూలి జమ కాకపోవడంతో కూలీలు ఇబ్బంది పడుతున్నారు. శ్రీకాళహస్తి పురపాలకసంఘానికి వంద మంది సిబ్బందిని నియమించాలి.

- బొజ్జల సుధీర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే

ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయండి



ఏడు మండలాలు, శ్రీసిటీ ఉన్న రిజర్వుడు నియోజకవర్గమైన సత్యవేడులో ఆర్డీవో కార్యాలయం ఏర్పాటు చేయాలి. పిడుగుపాటు, విద్యుత్ షాక్ తదితర ప్రమాదాలకు గురై హఠాన్మరణం చెందుతున్న బాధిత కుటుంబాలను ప్రభుత్వం ఆర్థిక సాయం చేసి ఆదుకోవాలి.

- ఆదిమూలం, సత్యవేడు ఎమ్మెల్యే

ఎంపీపీ కుర్చీకోసం కీచులాట!

- వరదయ్యపాళెం వైసీపీలో వర్గపోరు.. క్యాంపునకు ఎంపీటీసీలు

వరదయ్యపాళెం, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): వరదయ్యపాళెం ఎంపీపీ కుర్చీ కోసం వైసీపీలో కుమ్ములాట మొదలైంది. ఆ పార్టీ మండల కన్వీనర్ దయాకర్‌రెడ్డి, ప్రస్తుత ఎంపీపీ పద్మప్రియ భర్త దామోదరం రెడ్డి మధ్య వర్గపోరు నెలకొంది. ఈ క్రమంలో ఎంపీపీని దింపేందుకు దాదాపు 9 మంది ఎంపీటీసీ సభ్యులను దయాకర్ రెడ్డి క్యాంపునకు తరలించినట్లు సమాచారం. అదే సమయంలో ఎంపీపీపై అవిశ్వాస తీర్మానం ప్రవేశ పెట్టేందుకు వారిని సిద్ధం చేసినట్లు తెలిసింది. ఇదంతా ఎందుకంటే.. 2021లో జరిగిన స్థానిక సంస్థల ఎన్నికల్లో ఎంపీపీ అభ్యర్థులుగా దయాకర్‌రెడ్డి తన భార్య హేమలతను, దామోదర్‌రెడ్డి కూడా తన భార్య పద్మప్రియను వేరువేరు సెగ్మెంట్లలో బరిలోకి దించగా ఇద్దరూ విజయం సాధించారు. ఎంపీపీ పదవిపై అప్పట్లో తీవ్ర పోటీ నెలకొనగా అప్పటి వైసీపీ పెద్దల ఆశీస్సులతో దామోదర్‌రెడ్డి మెజారిటీ ఎంపీటీసీ సభ్యులను పాండిచ్చేరి తరలించి.. పద్మప్రియను ఎంపీపీగా చేసుకున్నారు. అలకపాన్పు ఎక్కిన దయాకర్‌రెడ్డిని అప్పట్లో వైసీపీ పెద్దలు ఎంపీపీ పదవిని రెండున్నర సంవత్సరాలు చెరో సగం పంచుకోవాలని సూచించినట్లు వార్తలు వెలువడ్డాయి. దీనికి సమ్మతించని దయాకర్‌రెడ్డి ఎంపీపీ రేస్‌నుంచి తప్పుకొన్నారు. ఈ క్రమంలో ఇప్పుడాయన అసమ్మతి ఎంపీటీసీ సభ్యులను తనవైపు తిప్పుకుని ఎంపీపీపై అవిశ్వాస తీర్మానానికి తెరలేపారు. బుధవారం కలెక్టర్‌ను కలిసి ఎంపీటీసీ సభ్యులతో అవిశ్వాస తీర్మానికి సన్నాహాలు చేసుకుంటున్నట్లు తెలిసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో వైరల్ కాగా, దీనిపై ఇద్దరూ మౌనం వహిస్తుండడం గమనార్హం.

రబీ సీజన్‌కు సమృద్ధిగా ఎరువులు



తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రబీ సీజన్‌కు 3.5 లక్షల ఎకరాల్లో పంటలు సాగవుతాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు. దీనికి సంబంధించి ఎరువులుగా సమృద్ధిగా ఉన్నాయని, రైతులు ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. కలెక్టరేట్‌లో మంగళవారం ఆయన ఎరువులపై అధికారులతో సమీక్షించారు. ప్రస్తుతం ఏపీ మార్క్‌ఫెడ్, రైతు సేవా కేంద్రాల వద్ద 2,128 టన్నులు, ప్రైవేటు డీలర్ల వద్ద 2,050 టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. వచ్చే నెల మొదటి వారానికల్లా మరింత యూరియా తెప్పించేలా చర్యలు చేపడతామన్నారు. అవసరమైన మేరకే ఎరువులు వాడాలని, ఎక్కువగా వాడటం పర్యావరణానికి కూడా మంచిది కాదన్నారు. ఈ కార్యక్రమంలో జేసీ శుభం బన్సల్, జిల్లా వ్యవసాయాధికారి ప్రసాదరావు, ఏపీమార్క్‌ఫెడ్ డీఎం పవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ స్టడీసర్కిల్‌లో ఉచిత శిక్షణ

తిరుపతి(విద్య), సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు ఏపీ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ ఇన్‌స్టిట్యూట్స్ సొసైటీ ఉమ్మడి జిల్లా కోఆర్డినేటర్ టి. పద్మజ మంగళవారం తెలిపారు. ఐబీపీ క్లర్క్, ప్రొబేషనరీ ఆఫీసర్, ఆర్ఆర్‌బీ ఆఫీసర్ స్కేల్-2, 3, ఆఫీస్ అసిస్టెంట్, ఎస్ఎస్‌సీ సీజీఎల్ టియర్-2 వంటి పోటీ పరీక్షల టైర్-2, మెయిన్ పరీక్షలకు తిరుపతి స్టడీ సర్కిల్‌లో ఉచిత వసతి సౌకర్యాలతో 60 రోజులపాటు శిక్షణ ఉంటుంది. అభ్యర్థులు apstdc.apcfss.in వెబ్‌సైట్ ద్వారా వచ్చేనెల 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. డిగ్రీ కలిగి ఉండాలి. సంబంధిత పరీక్షల టైర్-1 లేదా ప్రిలిమినరీ పరీక్ష రాసుండాలి. వివరాలకు తిరుపతిలోని బీఆర్ అంబేడ్కర్ స్టడీ సర్కిల్ కార్యాలయం లేదా ఏపీఎస్‌డబ్ల్యుఆర్ఈఐఎస్‌ను 86396 27455, 81422 24539 లలో సంప్రదించాలి.

'ఎర్ర' స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు

తిరుపతి(నేరవిభాగం) సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎర్రచందనం స్మగ్లర్‌కు ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ ఎర్రచందనం రాష్ట్ర స్థాయి కోర్టు న్యాయమూర్తి నరసింహమూర్తి మంగళవారం తీర్పు చెప్పారు. రెడ్ శ్యాండిల్ టాస్క్‌ఫోర్సు చీఫ్ సుబ్బరాయుడు కథనం మేరకు.. తమిళనాడు రాష్ట్రం ధర్మపురి జిల్లాకు చెందిన అండి 2017లో చామల రేంజ్, నాగపట్ల సెక్షన్, బొబ్బాలబావి పరిధిలో ఎర్రచందనం చెట్లు నరకడానికి అడవిలోకి వెళుతున్నాడు. అప్పట్లో అటవీశాఖ, టాస్క్‌ఫోర్సు అధికారులు దాడులు చేసి అతడిని పట్టుకున్నారు. దీనిపై విచారించి కేసు నమోదు చేశారు. అనంతరం కోర్టు ఎదుట హాజరుపరచగా అతడికి రిమాండ్ విధిస్తూ న్యాయమూర్తి తీర్పు చెప్పారు. ఈ నేపథ్యంలో ఈ కేసును తిరుపతిలోని రాష్ట్రస్థాయి ఎర్రచందనం కోర్టుకు బదిలీ చేసి కేసు విచారించారు. దీనిపై స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ అమర నారాయణ వాదనలు వినిపించారు. ఇరువర్గాల వాదనలు విన్న న్యాయమూర్తి నరసింహమూర్తి నిందితుడికి ఐదేళ్ల జైలుతో పాటు రూ.ఆరు లక్షల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

పుత్తూరు వార్తలు

ధనలక్ష్మి అలంకరణలో ద్రౌపది అమ్మవారు



ధనలక్ష్మిగా ద్రౌపది దేవి - అష్టభుజి దుర్గాదేవి అలంకరణలో కామాక్షమ్మ - మహేశ్వరిగా నాగాలమ్మ

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం ద్రౌపదిదేవి సమేత ధర్మరాజ స్వామి ఆలయంలో అమ్మవారిని ధనలక్ష్మిగా అలంకరించి పూజలు నిర్వహించారు. సదాశివేశ్వర స్వామి ఆలయంలో కామాక్షమ్మను అష్టభుజి దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. రైల్వే క్వార్టర్స్‌లో కొలువై ఉన్న నాగాలమ్మను మహేశ్వరి దేవిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

వడమాలపేట (ఆంధ్రజ్యోతి): నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం కన్యాకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు అన్నపూర్ణా దేవి అలంకారంలో దర్శనమిచ్చారు. వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో సాయంత్రం మహిళలు లలితా సహస్ర నామార్చన, కుంకుమ పూజలు చేశారు.

ఆయుర్వేదంతో వ్యాధుల నివారణ

పుత్తూరు,సెప్టెంబరు23(ఆంధ్రజ్యోతి):వ్యాధులకు చికిత్సే కాదు ముందస్తు నివారణ కూడా ఆయుర్వేద వైద్యం సూచిస్తుందని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి అన్నారు. కళాశాలలో ధన్వంతరి జయంతి సందర్భంగా ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ... జీవన విధానం, యోగా, ధ్యానం, ఆరోగ్యకర ఆహారం తీసుకోవడం వంటి విషయాలను ఆయుర్వేదం చెబుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు మన్యం నరసింహులు, కోటేశ్వరరావు, పద్మావతి పాల్గొన్నారు.

జీఎస్టీ తగ్గించి మందులను విక్రయించాలి

పుత్తూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మందులను తప్పని సరిగా తగ్గిన జీఎస్టీ తగ్గించి విక్రయించక పోతే కఠిన చర్యలు తీసుకుంటామని తిరుపతి డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్ రూత్ హెచ్చరించారు. పట్టణంలోని పది మందుల దుకాణాలను ఆమె తనిఖీ చేశారు. వివిధ రకాల మందులపై జీఎస్టీ 18 శాతం నుంచి 5 శాతం తగ్గిందన్నారు. ఈనెల 22 నుంచి తగ్గింపు పన్ను అమల్లోకి వచ్చినందున బిల్లులలో ఈ మేరకు తప్పని సరిగా తగ్గించి వినియోగదారులకు ఇవ్వాలని ఆదేశించారు. దుకాణంలో ఫార్మాసిస్ట్ తప్పని సరిగా ఉండాలని సూచించారు.

ఎయిడ్స్‌పై విద్యార్థులకు అవగాహన

పుత్తూరు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ వ్యాధి వ్యాప్తి, నివారణపై ప్రభుత్వ ఎస్ఆర్ఎస్ జూనియర్ కళాశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ గోపాల్‌రెడ్డి మాట్లాడు తూ... హెచ్ఐవి బాధితుల పట్ల వివక్ష చూపకూడదన్నారు. ఈ కార్యక్ర మంలో స్టెప్స్ స్వచ్ఛంద సంస్థ నిర్వాహకులు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

సమగ్ర పంటల యాజమాన్యంతో ఆదాయం

పుత్తూరు టౌన్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): సమగ్ర పంటల యాజమాన్యంతో రైతుకు ఆదాయం ఉంటుందని ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ వర్శటీ కోఆర్డినేటర్ రామకృష్ణరావు పేర్కొన్నారు. మంగళవారం మండలంలోని అమరంకండ్రిగలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. పుత్తూరు సహాయ వ్యవసాయ సంచాలకురాలు లక్ష్మీదేవి మాట్లాడుతూ వరి, వేరుశనగ, మామిడిలో ఆశించే పురుగులు, తెగుళ్ల నివారణకు సస్య రక్షణ పద్ధతుల గురించి వివరించారు. రసాయన ఎరువులకు ప్రత్యామ్నాయంగా జీవన ఎరువులను, పురుగు మందులకు ప్రత్యామ్నాయంగా జీవ సంబంధమైన మందులు పిచికారీ చేసుకోవాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో కోదండయ్య, వీహెచ్ఏలు ప్రియాంక, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదరిక నిర్మూలనే పీ4 లక్ష్యం

సత్యవేడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పేదరిక నిర్మూలనే పీ4 ప్రధాన లక్ష్యమని ఎంపీపీ ప్రతిమ, జడ్పీటీసీ సభ్యురాలు విజయలక్ష్మి పేర్కొన్నారు. పేదరిక నిర్మూలన కోసం ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకువచ్చిన పీ4 విధానం అమలుపై ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీడీవో త్రివిక్రమరావు అధ్యక్షతన మార్గదర్శకుల గుర్తింపు, బంగారు కుటుంబాల ఎంపికపై గ్రామ కార్యదర్శులు, పీ4 కో- ఆర్డినేటర్లతో సమీక్షించారు. ఉన్నత వర్గాలకు చెందిన చాలామంది ఏదో ఒక రూపంలో పేదలకు సాయం చేసేందుకు ఆసక్తిగా ఉంటారని, అలాంటి వారికి పీ4ను వేదిక అని ఎంపీపీ, జడ్పీటీసీ సభ్యురాలు అన్నారు. ఎంపీడీవో త్రివిక్రమరావు మాట్లాడుతూ పీ4లో మండలవ్యాప్తంగా 3,388 కుటుంబాలను గుర్తించగా, వారిలో ఇప్పటి వరకు 2,297 కుటుంబాలను 83 మంది మార్గదర్శకులు దత్తత తీసుకున్నారని తెలిపారు.

ఆయుర్వేద వైద్య శిబిరానికి స్పందన



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

సత్యవేడు, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఆయుర్వేద దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీసిటీలోని స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంలో మంగళవారం శ్రీసిటీ ఫౌండేషన్, శ్రీతులసి ఆయుర్వేద ఆస్పత్రి సంయుక్తంగా నిర్వహించిన వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. శ్రీసిటీ పరిశ్రమల ఉద్యోగులు, పరిసర గ్రామాల ప్రజలు వైద్య సేవలను వినియోగించుకున్నారు. తులసి ఆయుర్వేదిక్ ఆస్పత్రి వైద్యుడు శివప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య బృందం వైద్య పరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా శ్రీసిటీ సీఎస్ఆర్ డైరెక్టర్ నిరీషా సన్నారెడ్డి మాట్లాడుతూ.. శ్రీసిటీ ప్రాంత ప్రజల ఆరోగ్య భద్రతకు తాము ఎల్లప్పుడు పెద్ద పీట వేస్తామని తెలిపారు. ఇకపై ఏటా శ్రీసిటీలో ఆయుర్వేద దినోత్సవాన్ని నిర్వహిస్తామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీసిటీ మెడికల్ సెంటర్ ఆవరణలో శ్రీసిటీ ప్రతినిధులు నిరీషా సన్నారెడ్డి, రమేష్‌కుమార్, డాక్టర్ శివప్రసాద్ ఆధ్వర్యంలో వివిధ ఔషధ మొక్కలు నాటారు.

ఉత్పత్తి రంగానికి జీఎస్టీ సంస్కరణలతో ఊతం

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వికసిత్ భారత్ సాధనే లక్ష్యంగా ఆత్మనిర్భర్ భారత్‌కు బాటలు వేస్తూ స్థానిక ఉత్పత్తి రంగానికి జీఎస్టీ సంస్కరణలు ఊతమిస్తాయని టీడీపీ రాష్ట్ర బీసీ విభాగ కార్యనిర్వాహక కార్యదర్శి ఉమేష్‌రావు అన్నారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయన మాట్లాడుతూ డబుల్ ఇంజన్ సర్కార్ డబుల్ బెనిఫిట్ ఇస్తూ జీఎస్టీ 4 శ్లాబుల నుంచి 2 శ్లాబులకు పరిమితం చేశారన్నారు. దీని వల్ల రాష్ట్రంలోని ప్రతి కుటుంబానికి సుమారు రూ.15వేలు ఆదా అవుతుందని తెలిపారు. పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఊరటనిస్తూ రోజువారీ అవసరాల నుంచి గృహోపకరణాల వస్తువుల వరకు ప్రతిదీ తక్కువ ధరకే సామాన్యులకు అందుబాటులోకి వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దశరథాచారి, వన్నియకుల క్షత్రియ సంక్షేమ కార్పొరేషన్ డైరెక్టర్ మిన్నల రవి తదితరులు పాల్గొన్నారు.


ప్రజలతో గౌరవంగా మెలగండి

రేణిగుంట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : సచివాలయాలకు వివిధ పనుల కోసం వచ్చే ప్రజల పట్ల గౌరవంగా మెలగాలని ఎంపీడీవో రవిచంద్ర సూచించారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సచివాలయ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీ4 మార్గదర్శకాలను ప్రజలకు అందుబాటులో ఉంచాలని తెలిపారు. ఈవోపీఆర్డీ ప్రభురావు తదితరులు పాల్గొన్నారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి



నాయుడుపేట: బాలత్రిపురసుందరిదేవిగా మూకాంబికాదేవి - డక్కిలి: ప్రత్యేక అలంకరణలో పార్వతీదేవి



కోట: గాయత్రీదేవిగా కోటమ్మ - రాజరాజేశ్వరి అలంకరణలో కన్యకా పరమేశ్వరి





సూళ్లూరుపేట చెంగాలమ్మ ఆలయానికి సారె తీసుకెళ్తున్న భక్తులకుతో సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి - మహాలక్ష్మి అలంకరణలో కన్యకాపరమేశ్వరి

వైభవంగా శరన్నవరాత్రి ఉత్సవాలు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేటలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. మంగళవారం చెంగాళమ్మ గాయత్రీ దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. సూళ్లూరు గంగమిట్ట కాపువీధి, కావలివీధి, గంగమిట్ట, శ్రీనగర్ కాలనీ, పొట్టి శ్రీరాముల వీధి, రైల్వేకాలనీవాసులు అమ్మవారికి సారె సమర్పించారు. సారె తీసుకొచ్చిన వారికి ఆలయ రాజగోపురం వద్ద సహాయ కమిషనర్ ప్రసన్నలక్ష్మి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. చండీయాగానికి చెన్నైకి చెందిన అనంతరాము, లక్ష్మీ సుభద్ర, అలంకారానికి నెల్లూరుకు చెందిన గునపాటి మురళికృష్ణా రెడ్డి, ప్రతిమ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు. అలాగే వాసవి కన్యకాపరమేశ్వరి మహాలక్ష్మి అలంకారంలో దర్శనమిచ్చారు. ఉదయం ఆలయంలో మహన్యాస పూర్వక ఏకాదశి రుద్రాభిషేకం, సహస్రనామార్చన చేశారు. వాకరచర్ల రమేష్, చిన్న సత్యనారాయణ, మల్లికార్జున, చంద్రశేఖర్ ఉభయకర్తలుగా వ్యవహరించారు. అదేవిధంగా నాగేశ్వరస్వామి ఆలయంలోని అమ్మవారు అన్నపూర్ణాదేవిగా దర్శనమిచ్చారు. చిట్టేటి పెరుమాల్, గోవిందమ్మ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని మూకాంబికాదేవి వీధిలో వెలసిన మూకాంబికాదేవి బాలత్రిపురసుందరిదేవి అలంకరణలో దర్శనమిచ్చారు. అలాగే పట్టణంలోని మానసాదేవి, పోలేరమ్మ, దుర్గాదేవి, అంకమ్మ, కన్యకా పరమేశ్వరి ఆలయాల్లో అమ్మవారు వివిధ అలంకరణలో దర్శనమిచ్చారు.

గూడూరు: శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని పలు ఆలయాల్లో అమ్మవార్లను వివిధ రూపాల్లో అలంకరించారు. స్థానిక సాయి సత్సంగ నిలయంలోని విజయదుర్గాదేవి ఉపపీఠంలో విజయదుర్గాదేవిని గాయత్రిదేవిగా, బజారుకలశం వద్ద అమ్మవారిని ఆదిశక్తిగా, నారాయణమ్మ పేరంటాళ్ల ఆలయంలో అమ్మవారిని గాయత్రిదేవిగా, రాజరాజేశ్వరీదేవిని గాయత్రిదేవిగా, కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారిని అన్నపూర్ణా దేవిగా, ధర్మరాజస్వామి ఆలయంలో ద్రౌపదిదేవిని లక్ష్మీదేవిగా, గంగమ్మ ఆలయంలో అమ్మవారిని శ్రీలక్ష్మీదేవిగా అలంకరించారు.

చిల్లకూరు: మండలంలోని తూర్పుకనుపూరు గ్రామంలో వెలసిన ముత్యాలమ్మను అన్నపూర్ణాదేవిగా అలంకరించి పూజలు నిర్వహించారు. అమ్మవారిని అర్ధరథంపై గ్రామోత్సవం జరిపారు. కలకొండ లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఆదిలక్ష్మీదేవిని ఆదిలక్ష్మీదేవిగా అలంరించారు.

డక్కిలి: దేవుని వెల్లంపల్లి స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి ఆలయంలోని అమ్మవారు పార్వతీదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. పార్వతీదేవికి భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకొన్నారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని కన్యకా పరమేశ్వరిని పరమేశ్వరిగా అలంకరించారు. మూలవిరాట్‌ను బాదంపప్పుతో, కర్ణకమ్మవీధిలోని కాత్యయనీదేవిని గాయత్రీదేవిగా, వెంకటేశ్వరస్వామిని కూర్మావతారంలో, బంగారుపేటలోని విష్ణుదుర్గాదేవిని గాయత్రీదేవిగా, మందనాంచరేశ్వరిని రాజరాజేశ్వరిగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు.

కోట: గ్రామదేవత కోటమ్మను గాయత్రిదేవిగా, వాసవీ కన్యకా పరమేశ్వరిని రాజరాజేశ్వరిగా అలంకరించారు.



గూడూరు: గాయత్రీదేవి అలంకరణలో విజయదుర్గాదేవి, అన్నపూర్ణాదేవిగా కన్యకాపరమేశ్వరి, ఆదిశక్తిగా బజారుకలశం అమ్మవారు, లక్ష్మీదేవిగా గంగమ్మ - వెంకటగిరి: విష్ణుదుర్గాదేవి, కాత్యయనీదేవిగా గాయత్రీదేవి

ప్రజా సమస్యలను పరిష్కరించలేని పదవులెందుకు?

- ఐదేళ్లలో ఒక్క పనీ చేయలేకపోయాం
- బయటకు వెళ్తే ప్రజలు ప్రశ్నిస్తున్నారు
- సమావేశంలో కౌన్సిలర్ల ఆవేదన



సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ దబ్బల శ్రీమంత్ రెడ్డి, పక్కన కమిషనర్ చిన్నయ్య - హాజరైన కౌన్సిలర్లు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు కౌన్సిలర్లుగా ఉండి, ఒక్క పని కూడా చేయలేకపోయాం... వార్డుల్లో సమస్యలు పరిష్కరించలేని పదవులు మాకెందుకు అంటూ పలువురు కౌన్సిలర్లు ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం చైర్మన్ దబ్బల శ్రీమంత్‌రెడ్డి అధ్యక్షతన జరిగింది. అజెండాలోని అంశాలను చర్చిస్తుండగా 9వ వార్డు కౌన్సిలర్ కడూరు లక్ష్మమ్మ జోక్యం చేసుకుంటూ సూళ్లూరు ప్రాంతంలో ఉన్న 6,7,8,9 వార్డుల్లో కనీసం తాగునీరు అందించలేకపోతున్నాం.. కొళాయిలు లేకపోయినా కొళాయి పన్నులు విధిస్తున్నారు... డ్రైన్‌లు, రోడ్లు సరిగా లేవు... ప్రతి సమావేశంలో కౌన్సిలర్లు మొరపెట్టుకుంటున్నా ప్రతిపాదనలు సిద్ధం చేశాం.. టెండర్లు పిలిచాం... అంటూనే ఐదేళ్లు గడిచిపోయింది. ఓట్లు వేసి గెలిపించిన ప్రజల సమస్యలను పరిష్కరించలేని పదవులు మాకెందుకు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. ఇదేదో అధికారుల మీద కోపంతోనో.. పాలకవర్గంపై కక్షతోనే చెప్పడం లేదని... కనీసం ఒక్క పనికూడా చేయలేకపోయామన్న బాధతో చెబుతున్నానని అన్నారు. 8, 18 వార్డుల కౌన్సిలర్లు ఈదూరు చెంగమ్మ, జనార్దన్ మాట్లాడుతూ సమస్యలపై ప్రజలు ప్రశ్నిస్తుంటే బయట తిరగలేకపోతున్నామని, మున్సిపల్ అధికారులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడంలేదని... చిన్నపాటి సమస్యలను కూడా పరిష్కరించలేని స్థితిలో ఉన్నామని ఆవేదన వ్యక్తం చేశారు. పన్నులు కట్టే ప్రజలకు కనీస సేవలు అందించలేని స్థితిలో మున్సిపాలిటీ ఉందంటే ఎవరి తప్పో మనమే ఆత్మ విమర్శ చేసుకోవాలన్నారు. 14 వార్డు కౌన్సిలర్ బందిల మహేష్ మాట్లాడుతూ మన్నారుపోలూరు మురికికూపంలా మారిందని, ఎక్కడ చూసిన మురుగునీటితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. వైస్‌చైర్మన్ చిన్న సత్యనారాయణ మాట్లాడుతూ బిల్డింగ్ ప్లాన్ అప్రూవల్స్ చాలా ఆలస్యం చేస్తున్నారని, దీని వల్ల సామాన్య ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కౌన్సిలర్లు తమ దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను పరిష్కరిస్తామని కమిషనర్ చిన్నయ్య హామీ ఇచ్చారు. అజెండాలో పొందుపరిచిన 29 అంశాలపై చర్చించారు. ఒక్క అంశాన్ని తిరస్కరించగా, మిగిలిన వాటికి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. సమావేశంలో వైస్ చైర్మన్ పోలూరు పద్మ, టీపీవో బాలసుబ్రహ్మణ్యం, ఆర్‌వో నారాయణరెడ్డి, డీఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం నిరసన

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 25వ వార్డులో మూడు రోజులుగా తాగునీరు రావడం లేదంటూ ఖాళీ బిందెలతో మహిళలు మంగళవారం నిరసన తెలిపారు. అధికారులకు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోయారు. రెండు రోజుల్లో సమస్య పరిష్కరించకపోతే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పోషణ్ పక్వాడా

కోట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చెందోడు పంచాయతీ ఎన్టీఆర్ గిరిజన కాలనీ అంగన్‌వాడీ కేంద్రంలో ఐసీడీఎస్ సూపర్ వైజర్ కవిత, ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడా కార్యక్రమం నిర్వహించారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నాయుడుపేట, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో చాగణం లలితమ్మ భాస్కర్‌రావు మెమోరియల్ ట్రస్టు ఆధ్వర్యంలో వెంకటేశ్వర అరవింద్ నేత్రాలయ సహకారంతో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. 208 మందికి పరీక్షలు నిర్వహించి 75 మందికి మందులు, 50 మందికి కంటి అద్దాలను అందజేశారు.

దాడి కేసులో ఏడుగురికి మూడేళ్ల జైలు

డక్కిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): దాడి కేసులో ఏడుగురికి మూడేళ్ల జైలు శిక్ష విధిస్తూ వెంకటగిరి కోర్టు జడ్జి విష్ణువర్మ మంగళవారం తీర్పు ఇచ్చారు. డక్కిలి మండలం డి.ఉప్పరపల్లి గ్రామానికి చెందిన కత్తి మల్లికార్జున, కె.పరుశురాం, వెంకటసుబ్బయ్య, నవీన్, రాజా, అశోక్, రాముడు 2018లో ఉప్పరపల్లి గ్రామంలో జరిగిన తిరునాళ్లలో చేమూరు బానుప్రకాష్ అనే యువకుడిపై దాడిచేసి గాయపరిచారు. విచారణలో నేరుం రుజువుకావడంతో నిందితులకు మూడేళ్ల జైలు శిక్షతో పాటు ఒక్కొరికి రూ.6,500 వంతున జరిమాన విధిస్తూ న్యాయమూర్తి తీర్పు ఇచ్చారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి

గూడూరు అర్బన్, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న డివైడర్‌పై గుర్తుతెలియని వ్యక్తి మృతి చెంది ఉండటాన్ని మంగళవారం స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఒకటో పట్టణ పోలీసుల వివరాల మేరకు... స్థానిక ఏరియా ఆస్పత్రి ఎదురుగా ఉన్న డివైడర్‌పై 60ఏళ్లకు పైబడి వయస్సు కలిగిన వ్యక్తి అపస్మారక స్థితిలో పడివుండటాన్ని స్థానికులు గుర్తించి ఏరియా ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి అప్పటికే అతను మృతిచెందినట్లు నిర్ధారించారు. మృతుడు సిమెంట్ కలర్ చెక్స్ చొక్కా, బులుగురంగు లుంగీ ధరించి ఉన్నాడు. మృతదేహాన్ని పోస్టుమార్టానికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

కారు ఢీకొని ఇద్దరికి గాయాలు

తడ, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కారు ఢీకొని ఇద్దరికి గాయాలయ్యాయి. మండల పరిధిలోని కారూరు పంచాయతీ బాలకృష్ణాపురం కుప్పం గ్రామానికి చెందిన గుణశేఖర్, సుమన్ బైక్‌పై బీవీపాళెం చెక్‌పోస్టు వద్ద వెళ్లారు. తిరిగి వెళ్తుండగా నెల్లూరు నుంచి చెన్నై వైపు వెళ్తున్న కారు వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో గుణశేఖర్, సుమన్‌కు తీవ్ర గాయాలవడంతో ఎలాఊరు ఆస్పత్రికి తరలించారు.

బైక్‌ను ఢీకొన్న ఆటో: వృద్ధుడి మృతి

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చంద్రబాబు కాలనీ సమీపంలో బైక్‌ను ఆటో ఢీకొన్న ఘటనలో వృద్ధుడి మృతి చెందాడు. ఉత్తరప్రదేశ్‌కు చెందిన రాము చంద్రబాబు కాలనీలో నివాసం ఉంటూ ఐస్ అమ్ముకుని జీవనం సాగిస్తున్నాడు. మంగళవారం రాత్రి పట్టణంలో సరుకులు కొనుక్కొని బైక్‌పై ఇంటికి వెళ్తుండగా ఆటో ఢీకొంది. ఈ ప్రమాదంలో రాము(60) అక్కడికక్కడే మృతి చెందాడు. మృతదేహాన్ని ప్రభుత్వాస్పత్రికి తరలించి పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇసుక తరలింపుపై వివాదం

నాయుడుపేట టౌన్, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగురుపాడు స్వర్ణముఖినది వద్ద ఇసుక తరలింపు విషయంలో మంగళవారం వివాదం చోటుచేసుకుంది. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనాస్థలికి చేరుకొని ఇరువర్గాలను పోలీసుస్టేషన్‌కు తీసుకెళ్లి విచారిస్తున్నారు.

డిప్యూటీ సీఎంను కలిసిన ఎమ్మెల్యే బొజ్జల



శ్రీకాళహస్తి,సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): అసెంబ్లీ సమావేశాల సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌ను మంగళవారం ఎమ్మెల్యే సుధీర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఆయనను కలంకారీ శాలువాతో సత్కరించారు. గుడిమల్లం ఆలయ విశిష్టను తెలిపే పుస్తకాన్ని అందించారు. త్వరలో గుడిమల్లం ఆలయాన్ని సందర్శిస్తానని డిప్యూటీ సీఎం తెలిపారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత ముక్కంటీశుడిని మధ్యప్రదేశ్ హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ దుప్పల వెంకటరమణ, సౌత్ సెంట్రల్ రైల్వేస్ డిప్యూటీ జనరల్ మేనేజరు ఉదయ్‌నాథ్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం మృత్యుంజస్వామి సన్నిధి వద్ద వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామిఅమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

మిద్దెతోటల పెంపకంపై శిక్షణ

రేణిగుంట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): మండలంలోని చైనత్యపురం రాస్ కృషి విజ్ఞాన కేంద్రంలో పెరటి, మిద్దె తోటల పెంపకంపై ఐదురోజుల శిక్షణ కార్యక్రమం మంగళవారం ప్రారంభమైంది. రాస్ కృషి విజ్ఞాన కేంద్రం, భారతీయ వ్యవసాయ పరిశోధన మండలి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో శాస్త్రవేత్త డాక్టర్ బి.నిర్మల మాట్లాడుతూ.. సంపూర్ణ పోషకాహారం తీసుకున్నపుడే ఆరోగ్యంగా ఉండగలమన్నారు. దాని కోసం అవసరమైన కూరగాయలు, ఆకుకూరలను ఇంటి ఆవరణలోనే పండించుకోవాలని సూచించారు. పద్మావతి మహిళా విశ్వవిద్యాలయ ప్రొఫెసర్ డాక్టర్ ఏ.అరుణ, కె.వి.కె హెడ్ డాక్టర్ ఎస్.శ్రీనివాసులు, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త బి.దివ్యసుధ మాట్లాడారు. అనంతరం పెరటి తోటలు, మిద్దెతోటల పెంపకానికి సంబంధించిన మెలకువలపై ముద్రించిన కరపత్రాలను ఆవిష్కరించారు. రైతులకు విత్తనాల కిట్లను, వర్మీకంపోస్టు తదితరాలను పంపిణీ చేశారు.

నేడు జాబ్ మేళా

సూళ్లూరుపేట, సెప్టెంబరు 23(ఆంధ్ర జ్యోతి): సూళ్లూరుపేటలోని వీఎస్ఎస్‌సీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం శ్రీసిటీలోని టీవీఎస్ ఇండోన్ పరిశ్రమ ఆధ్వర్యంలో జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ ఎస్ఎల్‌బీ శంకర్ తెలిపారు. 2021-25 మధ్య డిగ్రీ, డిప్లొమా చదివిన మహిళలు అర్హులన్నారు.

గేట్ పుత్తూరు మసీద్ అభివృద్ధికి వినతి



కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న ముస్లిం మైనార్టీ నాయకులు

పుత్తూరు అర్బన్, సెప్టెంబర్ 23(ఆంధ్రజ్యోతి): గేట్ పుత్తూరులోని మసీద్ అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ముస్లిం మైనార్టీ నాయకులు కోరారు. మంగళవారం కలెక్టర్‌ను మార్యద పూర్వకంగా కలిసి వినతిపత్రం సమర్పించారు. అభివృద్ధి పనుల నిమిత్తం రూ.1.25 కోట్లు మంజూరు చేయాలని కోరారు. మొహమ్మద్ గౌస్, షబ్బీర్, హమీద్ బాషా, యూనిస్, జీలు, ముస్తఫా పాల్గొన్నారు.

ఆల్తూరుపాడు నిర్మాణానికి నిధులివ్వండి: కురుగొండ్ల



సీఎంకు వినతిపత్రం ఇస్తున్న కురుగొండ్ల

డక్కిలి, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): డక్కిలి మండలంలోని ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణానికి నిధులు విడుదల చేయాలని వెంకటగిరి ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ ముఖమంత్రి చంద్రబాబు నాయుడికి విజ్ఞప్తి చేశారు. మంగళవారం అసెంబ్లీ సమావేశాల అనంతరం ఎమ్మెల్యే రామకృష్ణ ముఖ్యమంత్రిని సీఎం చాంబర్‌లో కలిసి నియోజకవర్గ సమస్యలను వివరించారు. ముఖ్యంగా ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణ పనులను గత వైసీపీ ప్రభుత్వం రీటెండరు పేరుతో అడ్డుకోని రైతు ప్రయోజనాలను దెబ్బతీసిందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చాక ఆల్తూరుపాడు రిజర్వాయరు నిర్మాణ పనులు మొదలు పెడతామని ఎన్నికల ముందు ఇచ్చిన హామీని చంద్రబాబుకు గుర్తు చేశారు. ఇందుకు సీఎం సానుకూలంగా స్పందించి రూ.630 కోట్లతో ఆల్లూరుపారు రిజర్వాయరు నిర్మాణానికి టెండర్లు పిలిచేందుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని ఎమ్మెల్యే చెప్పారు. అలాగే వెంకటగిరి పట్టణ నడిబొడ్డున ప్రవహించే కైవల్యానదిని అభివృద్ధి చేసేందుకు ప్రతిపాదనలు అందజేయగా సీఎం సానుకూలంగా స్పందించారని, ఇంకా వెంకటగిరిలో 100 పడకల ఆస్పత్రి, డయాలిసిస్ సెంటరు ఏర్పాటు విషయాన్ని ప్రస్తావించగా దశలవారీగా ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని కురుగొండ్ల తెలిపారు.

శ్రీకాళహస్తి
సత్యవేడు

కరుణించు తల్లీ.. కల్పవల్లి

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): కరుణించు తల్లీ కల్పవల్లి అంటూ భక్తులు ప్రణమిల్లారు. దసరా ఉత్సవాల్లో భాగంగా రెండో రోజు మంగళవారం వివిధ రూపాల్లో ఆయా ఆలయాల్లో కొలువైన అమ్మవార్లు భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. భక్తులు శ్రద్ధతో ఉదయంనుంచే ఆలయాలకు వెళ్లి దీపారాధనలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో జ్ఞానప్రసూనాంబిక ఉత్సవ మూర్తిని మహావిష్ణువుగా అలంకరించారు. సాయంత్రం అమ్మవారికి ప్రత్యేకంగా ధూపదీప నైవేద్యాలు సమర్పించి ఆలయంలో రంగుల గోపురం వరకు ఊరేగించారు. అలాగే ఆలయంలో ఏర్పాటు చేసిన బొమ్మల కొలువులో అమ్మవారు ఉత్సవమూర్తి బ్రహ్మచారిణిగా కొలువుదీరారు. ఇదే ఆలయంలో కొలువై ఉన్న కనక దుర్గమ్మ బాలాత్రిపురసుందరిగా, ఆలయానికి అనుబంధంగా కనకాచలంపై కొలువై ఉన్న కనకదుర్గమ్మను విశేషంగా అలంకరించారు. ఆలయానికి అనుబంధంగా ఉన్న ముత్యాలమ్మ ఆలయంలో అమ్మవారిని బాలా త్రిపుర సుందరిగా అలంకరించారు. శ్రీకాళహస్తి మండలం వేడాం గ్రామంలో కొలువై ఉన్న దక్షిణ కాళికాదేవి గాయత్రీమాతగా, శ్రీకాళహస్తి పట్టణంలోని బజారువీధిలో ఉన్న కన్యకాపరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గర్భరక్షాంబికా దేవిగా, బీపీఅగ్రహారం చిన్నగంగమ్మ గాయత్రీ దేవిగా, పెద్దగంగమ్మ వెండి కవచాలంకృత అలంకారంలో, భాస్కరపేట చాముండేశ్వరి అమ్మవారు భవానీమాతగా భక్తులకు దర్శనమిచ్చారు. తెట్టు వద్ద నల్లగంగమ్మ బాలా త్రిపుర సుందరిగా, పానగల్ గంగమ్మ, బహదూరుపేటలోని కన్యకాపరమేశ్వరి, విశ్వ బ్రాహ్మణ వీధిలోని గంగమ్మ, ముత్యాలమ్మ గుడివీధిలోని నింబజాదేవి, అష్టలక్ష్మి, పూసల వీధి గంగమ్మ, శీతాలాంబ, త్రిశూలాంబ, సంత మైదానం అంకాళమ్మ, వీవీరోడ్డులోని అంకమ్మ అమ్మవార్లు విశేషాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.

బాలాత్రిపుర సుందరిగా అవనాక్షమ్మ

నారాయణవనం (ఆంధ్రజ్యోతి): మండలంలోని సముదాయం గ్రామంలో కొలువై ఉన్న అవనాక్షమ్మ ఆలయంలో అమ్మవారు బాలాత్రిపుర సుందరిగా భక్తులకు దర్శనమిచ్చారు. కైలాసనాథ కోనలోని కామాక్షి అమ్మవారు గాయత్రీ దేవి అలంకరణలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ వీరభద్రస్వామి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సర్వమంగళా దేవి గాయత్రీదేవిగా భక్తులను కటాక్షించారు.

వరదయ్యపాళెం (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి ఆలయంలో అమ్మవారు గాయత్రీదేవీ అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

పిచ్చాటూరు(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరి అంకాళపరమేశ్వరి ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం గాయత్రీదేవి అలంకరణలో అంకాళపరమేశ్వరి భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం చేసుకున్న భక్తులకు ఆలయ పూజారి తీర్థ ప్రసాదాలు అందించారు.

కంచి కామాక్షిగా మరగదాంబిక

నాగలాపురం (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురుటుపల్లి పల్లికొండేశ్వర ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాల్లో మంగళవారం మరగదాంబిక అమ్మవారు కంచికామాక్షి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. సాయంత్రం ఆలయ వాహన మండపంలో మరగదాంబిక ఉత్సవ విగ్రహానికి పంచామృతాభిషేకం నిర్వహించి, పట్టువస్త్రాలతో బంగారు ఆభరణాలతో సుందరంగా అలంకరించి ఊంజల్ సేవ నిర్వహించారు. పూజా కార్యక్రమాలను ఆలయ ఈవో లత పర్యవేక్షించారు.



బ్రహ్మచారిణిగా జ్ఞానప్రసూనాంబ - కంచి కామాక్షిగా మరగదాంబిక



బ్రహ్మచారిణిగా ఏడుగంగమ్మల అమ్మవారు - బాలా త్రిపుర సుందరిగా ముత్యాలమ్మ - గాయత్రీమాతగా దక్షిణకాళికాదేవి - భవానీమాతగా చాముండేశ్వరి - గర్భరక్షాంబికాదేవిగా బజారువీధి కన్యకాపరమేశ్వరి



లలితాదేవి అలంకారంలో పొన్నాలమ్మ- గాయత్రీదేవిగా బీపీఅగ్రహారం చిన్నగంగమ్మ- వెండి కవచకృత అలంకారంలో పెద్దగంగమ్మ- బాలా త్రిపురసుందరిగా నల్లగంగమ్మ - మహావిష్ణువు అలంకారంలో దర్శనమిచ్చిన జ్ఞానప్రసూనాంబ అమ్మవారు



గాయత్రిదేవిగా సర్వమంగళాదేవి - పుష్పాలంకరణలో గాయత్రీదేవిగా కామాక్షమ్మ - బాలా త్రిపుర సుందరి అలంకరణలో అవనాక్షమ్మ - గాయత్రీదేవిగా కామాక్షిదేవి







వైసీపీ పాలనలోనే టీటీడీలో భారీ కుంభకోణం



మీడియా సమావేశంలో టీడీపీ నేతలు

ఏర్పేడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): వైసీపీ పాలనలో టీటీడీలో భారీస్థాయిలో అవినీతి జరిగిందని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురవారెడ్డి ఆరోపించారు. ఏర్పేడు పట్టణంలో ఆయన పార్టీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. వైసీపీ పాలనలో టీటీడీలో పనిచేసిన ఉద్యోగి రవికుమార్, ఛైర్మన్‌గా వ్యవహరించిన కరుణాకరరెడ్డి, ఈవో ధర్మారెడ్డి కోట్ల రూపాయల అవినీతి అక్రమాలకు పాల్పడ్డారని చెప్పారు. అయితే భారీస్థాయిలో అక్రమాలకు పాల్పడిన వైసీపీ నేతలు నేడు తప్పుడు ప్రచారాలు చేయడం బాధాకరమన్నారు. వైసీపీ నేతలు చేస్తున్న తప్పుడు ప్రచారాలను ఆయన ఖండించారు. 2023లో ఈవోగా, ఛైర్మన్‌గా పనిచేసిన ధర్మారెడ్డి, కరుణాకర రెడ్డిపై పూర్తిస్థాయిలో విచారణ చేయాలని డిమాండ్ చేశారు. వెంకన్న జోలికి వెళ్లినవారికి పుట్టగతులుండవని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నాగేశ్వరరావు, కృష్ణవేణి, బాలాజీరావు, మహేష్‌రెడ్డి, రాచేటి సుబ్రహ్మణ్యం, వెంకటరమణ, సదాశంకర్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలను సరిచూడండి

బుచ్చినాయుడుకండ్రిగ, సెప్టెంబరు 23 (ఆంధ్రజ్యోతి): మండలంలో 2002 ఓటర్ల జాబితాతో 2025 జాబితాను సరిచూడాలని తహసీల్దార్ శ్రీదేవి ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో మంగళవారం బీఎల్వోల సమావేశంలో ఆమె మాట్లాడుతూ... దేశంలో ఓటర్ల జాబితాలో అవకతవకల నేపథ్యంలో కేంద్ర ఎన్నికల సంఘం ప్రతి మండలంలో 2002 సంవత్సరం ఓటర్ల జాబితాను 2025 ఓటర్ల జాబితాతో సరి పోల్చాలని ఆదేశించిందన్నారు. ఈ మేరకు జాబితాను సిద్ధం చేసి కార్యాలయానికి చేర్చాలన్నారు. మండలంలోని 35 బూత్‌లకు సంబంధించిన 2002 ఓటర్ల జాబితాను బీఎల్వోలకు అందించారు.

గుడిమల్లం ఆలయంలో పుష్పయాగం

గాయత్రీదేవిగా ఆనందవల్లి దర్శనం



పుష్పయాగం కోసం పూలను తీసుకువస్తున్న గిరినాయుడు దంపతులు, ఆలయ అధికారులు

ఏర్పేడు, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): దేశంలో మొదటి శివాలయంగా పేరుగాంచిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆనందవల్లి అమ్మవారికి పుష్పయాగాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయ పాలకమండలి మాజీ ఛైర్మన్ గిరినాయుడు దంపతులు, ఈవో రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో పూలను తెచ్చి అమ్మవారికి వినియోగించారు. చిందేపల్లిలో కొలువై ఉన్న సిద్దేశ్వరస్వామి ఆలయంలో పార్వతీదేవి, ఏర్పేడులోని ఎల్లమ్మ, పాతవీరాపురం గ్రామదేవత చెంగాలమ్మ గాయత్రీదేవిగా భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



ఆనందవల్లి అమ్మవారికి పుష్పయాగం



యాగానికి సిద్దంగా ఉన్న పూలు

సీఎంఆర్ఎఫ్ అందజేత

శ్రీకాళహస్తి, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి): సీఎం సహాయనిధిని మంగళవారం ఎమ్మెల్యే సుధీర్ సతీమణి రిషితారెడ్డి బాధితుల ఇంటికి వెళ్లి అందజేశారు. తొట్టంబేడు మండలం లింగమనాయుడుపల్లికి చెందిన శివకుమార్ అనారోగ్యంలో ఆస్పత్రిలో చికిత్స పొందాడు. సీఎం సహాయనిధి కోసం ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. ఈ క్రమంలో రూ.4.76లక్షల చెక్కును మంగళవారం రిషితారెడ్డి బాధితుల ఇంటికివెళ్లి అందజేశారు.

పిచ్చాటూరు (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరికి చెందిన భూపతిశెట్టి అనారోగ్యంతో చెన్నైలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో వైద్యం తీసుకున్నారు. ఆ వైద్య ఖర్చులకు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ. 2.70 లక్షలను టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవులు నాయుడు అందించారు.

ఇసుక తవ్వకాలపై దాడులు



రేణిగుంట, సెప్టెంబరు 23(ఆంధ్రజ్యోతి) : మండలంలోని గాజులమండ్యం పంచాయతీ పరిధిలోని పిల్లపాళెంలోని ప్రైవేటు భూముల్లో ఇసుక అక్రమ తవ్వకాలపై మంగళవారం రెవెన్యూ అధికారులు దాడులు నిర్వహించారు. తహసీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ దాడుల్లో ఎక్స్‌కవేటర్ సహా నాలుగు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకున్నారు. ఇసుక రవాణాదారులు సంఘటనా స్థలం నుంచి పరారయ్యారు. స్వాధీనం చేసుకున్న వాహనాలను పోలీసు స్టేషన్‌కు తరలించారు.









